# సమర్థ సద్గురు

మే 2024

ఆధ్యాత్మిక మాసపత్రిక

వెల : రూ. 10.00



## మార్చి 3 నుండి 5 వరకు గుండుగొలను గ్రామ
## శ్రీ కాళీవనాశ్రమ శాఖ వార్షిక సత్సంగ దృశ్యములు



శ్రీ సద్గురు పాదపూజ



సత్సంగము



సామూహిక పూజలు

# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ



సంపుటి 43 సంచిక 9

పేజీలు 44

మే 2024

5సం॥ల చందా రూ. 500

2సం॥ల చందా రూ. 240

సంవత్సర చందా రూ. 120

విడిప్రతి వెల...... రూ. 10

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD


ఈ సంచికలో ................................ ....... పేజీ


దాశరథీ శతకము ............................. ..........4

శ్రీబాబూజీ ఉవాచ.......................................... 5

అమ్మమాట................................... ............ 7

భక్తి ................................................... ......................10

భవరోగ వైద్యం ......... . ..................................12

వాల్మీకి రచనా వైశిష్ట్యం ...........................15

నేను లేకపోతే?...................................................16

గురుర్బినా గతిర్నాస్తి.........................................18

యద్భావం తద్భవతి .........................................20

శాస్త్రి ..... ....................... ....................... ..................... 21

శ్రీ కుసుమ హరనాథ్ ...... ...............................25

నారద భక్తి సూత్రములు ............... ..............27

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు ......29

మనశ్శతకము ...................................................30

నిరీక్షణ ........................................................................31

తలరాత ................................. ..........................34

ప్రేమ వర్షిస్తే మోడులు చిగురిస్తాయి.................................35

సమర్థ సద్గురునాథుని దివ్యచరిత్ర.....38

విష్ణు కథలు ...... ........................... ....................40

## దాశరథీ శతకము - భద్రాచల రామదాసు

46) అగణిత జన్మకర్మదురి తాంబుధిలో బహుదుఃఖ వీచికల్
దెగిపడవీడలేక జగతీధర నీపదభక్తి నావచే
దగిలి తరింపగోరితి బదంపబడి నాదు భయంబు మాంపవే
తగదని చిత్తమం దిడక దాశరథీ కరుణాపయోనిధీ!



భావం - సంసార సాగరమును, నా పూర్వజన్మ కర్మ పరిపక్వములను ఈదలేక నిన్ను వేడుకుంటున్నాను. దయదలచి నన్ను కాపాడు దాశరథీ! నీ పాదముల వద్ద భక్తి యనెడి పడవచేత బయట పడవలె ననుకొనుచుంటిని.

*శివునికి తల్లి అయిన భక్తురాలు ఎవరు?
*సుగుణ తన భర్తలో మార్పును ఎలా తెచ్చింది?
*చైతన్య మహాప్రభువు తిరిగి ఏ రూపంలో జన్మించారు?
*దేవుడు తెచ్చిన పెట్టెలో ఏముంది?
*జగన్మాత 'కాళీ' ఎందుకు అయ్యింది?
*గురువు నీవాడు ఎప్పుడు అవుతాడు?
*మనను తేలికగా మూడంతస్తులు ఎక్కించే లిఫ్ట్ ఏది?
*హనుమంతునికి లంకను కాల్చమని సూచన ఇచ్చినదెవరు?
*తప్పులు చేసే వారిని కూడా గురువులు ఎందుకు చేరదీస్తారు?
*మనస్సుని ఆవరించిన జిడ్డును పోగొట్టగల రసము ఏది?

*సమాధానాలు లోపలి పేజీలలో ............................*

# శ్రీ బాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

10-12-1980

ఈ రోజు రాత్రి ప్రార్థన అయిన తర్వాత శ్రీబాబూజీ భక్తులను ఉద్దేశించి బోధ చేశారు. శ్రీబాబూజీ మాట్లాడుతూ "రామరసము యొక్క మాధుర్యము అనంతమైనది. రామరసము చాలా పవిత్రమైనది. అందుచేతనే సమర్థ రామదాసుగారు ఆ నామాన్ని స్మరించి తరించారు 'శ్రీరామ జయరామ జయ జయ రామ' అనే మంత్రాన్ని సమర్థ రామదాసుగారు స్మరించారు.



శ్రీ అంటే మంగళ స్వరూపమైనది, సత్యమైనది, జ్ఞానం. అదే వెలుగు. అది అజ్ఞానాన్ని హరిస్తుంది. రామతారకంలో మూడు పర్యాయాలు రామ అని వస్తుంది. మొదటి పర్యాయము వుచ్చరించే రామ మనకు బ్రహ్మత్వానికి అడ్డుగా ఉన్న ఆవరణని తొలగిస్తుంది. రెండవ రామ బ్రహ్మత్వంలో లయింపజేస్తుంది. మూడవ రామ పూర్ణత్వాన్ని పొందింపజేస్తుంది. రామనామం మనని రక్షిస్తుందా? అని చాలా మందికి అనుమానం వస్తుంది. భగవానుడు మనల్ని రక్షిస్తాడా? అని కూడా అనుమానం వస్తుంది.

కన్నతల్లికి తన పిల్లలకి ఎప్పుడు పాలు పట్టాలో, ఎప్పుడు నీళ్ళు పోయాలో, ఎప్పుడు మందు పోయాలో తెలియదా? కన్నతల్లి తన పుత్రునిపై వాత్సల్యాన్ని చూపదా! మరి జగత్పితయైన పరమేశ్వరుడు తన బిడ్డలకు లోటు చేస్తాడా! ఎవరికి ఎప్పుడు ఏది అందజేయాలో అప్పుడు దానిని అందజేస్తాడు. అయితే మనకు అట్టి విశ్వాసము ఉండాలి. అది పరమాత్ముని పైన మనస్సు లగ్నం చేయడం వలన లభిస్తుంది. మనస్సు పరమాత్మపై నిలబడటం చాలా కష్టము. మనస్సుని ఆవరించి జన్మ జన్మాంతర వాసనలు, గుణత్రయాలు, ఈషణత్రయాలు అరిషడ్వర్గాలు

మొదలైన జిడ్డులు వుంటాయి. మనస్సుని ఆవరించిన జిడ్డును పోగొట్టగల రసము ఈ జగత్తులో లేదు. ఆ జిడ్డుని పోగొట్టగల శక్తి రామరసానికి ఉంది. రామరసం మనస్సుకి పట్టిన మతంజిడ్డు, కులంజిడ్డు, గోత్రంజిడ్డు, జాతిజిడ్డు, స్వజాతి విజాతి జిడ్డు మొదలైన వాటన్నింటిని వదిలిస్తుంది. కాబట్టి మనస్సు రామరసాన్ని గ్రోలినపుడు ఇంద్రియాలన్నీ తమ విధులు నిర్వర్తిస్తున్నా ఆనందాన్ని అనభవిస్తుంటారు. సన్యసించవలసింది మనస్సును, అంతేకాని దారాపుత్రాదులను కాదు.

పచ్చిమామిడికాయ పసరు, పులుపు అనే గుణాలను కలిగి వుంటుంది. అది వృక్షాన్ని గట్టిగా అంటిపెట్టుకుని ఉంటుంది. దానిని బలవంతాన లాగితే సొన వస్తుంది. అది దుఃఖపూరితమైనది. మామిడికాయ పక్వస్థితికి వచ్చినపుడు ఫలము అని పిలువబడుతుంది. పసుపు వర్ణాన్ని కలిగియుంటుంది. మధురత్వాన్ని పొందుతుంది. మామిడి ఫలము రూపము, గుణము మారింది. అది ఇప్పుడు ఆ వృక్షానికి అంటిపెట్టుకొని ఉండమన్నా ఉండదు. ఏ క్షణాన్నైనా ఊడిపోతుంది. అట్టి స్థితిని పొందినవాడే సన్యాసి. అటువంటి సన్యాసి ఎప్పుడూ నిత్యానంద స్థితిలో ఉంటాడు. అటువంటి సన్యాసి సంసారంలో ఉంటే మాత్రమేమిటి? సంసారము అతనిని బంధించ గల్గుతుందా? సంసారము నుంచి అతను పారిపోవలసిన పని ఏముంది?" అని ప్రశ్నించారు.

"కాశీ వెళ్ళి కాకరకాయ వదిలివేశాను బాబుగారూ" అన్నాడు పిచ్చయ్య అని ఒక భక్తుడు. "కాశీ వెళ్ళినవాడు కాకరకాయ వదిలితే ఏంలాభం? తన అహంకారాన్ని పరిత్యజించాలి. ఆ విశ్వేశ్వరుణ్ణి మనస్సులో నిలుపుకోవాలి. అహంకారాన్ని వదిలితే ఇంకేదీ వదలనవసరంలేదు" అన్నారు శ్రీ బాబూజీ.

# అమ్మ మాట

- జపమాలా ప్రసాద

***శ్రీ గురురూపిణి - కృపామయి మా***

మనకి మొట్టమొదటి గురువు మన తల్లి. నవమాసాలూ మోసి, కని, స్తన్యమిచ్చి, అడుగడుగునా, క్షణక్షణమూ కంటికి రెప్పలా చూచుకుంటూ, మనని పెంచి పెద్దచేసే మనతల్లే మనకి మొదటి గురువు. కానీ, యీ కర్మ తల్లి మనని కొంతవరకే తీసుకుని వెళ్ళగలదు. **గుకారశ్చాంధకారస్తు రుకారస్తన్నిరోధకృత్ । అంధకార వినాశిత్వాత్ గురురిత్యభిధీయతే** అని గురుశబ్దానికర్థం **గురుగీత** చెబుతున్నది. అంటే, 'గు' కారమనగా అంధకారము, 'రు' కారమనగా ఆ అంధకారాన్ని నిరోధించే తేజస్సు. కనుక అజ్ఞానమనే చీకటిని పారద్రోలే తేజస్సు 'గురు' అని చెప్పబడుతున్నది.



మరి యీ అజ్ఞానాంధకారాన్ని పారద్రోలే తల్లి ఎవరు? జగజ్జననియైన జగదాంబయే 'శ్రీగురురూపిణి' అని లలితాసహస్ర నామాలలోనే వుంది. మానవుల హృదయకంజాతములలో పేరుకొని పోయిన అజ్ఞానమనే చీకటిని పారద్రోలడానికి ఆ అనంతశక్తి స్వరూపిణి అయిన జగజ్జనని గురురూపంలో మనకి సాక్షాత్కరించి, జ్ఞానక్షీరాలని ప్రసాదిస్తూ, మనలని జ్ఞాన స్వరూపులుగా తీర్చిదిద్దుతోంది. ఆ గురుమాత సాక్షాత్తు నారాయణ స్వరూపిణి. ఆవిడే త్రిమూర్తుల యొక్క శక్తి. సృష్టి, స్థితి, లయాలను చేసేది ఆ జగన్మాతే. ఆ గురుస్వరూపిణి మనలో భక్తి బీజాలని నాటి, వాటిని తన బోధామృతమనే వర్షముతో పెంపు చేసి, చివరకి మనలని తన స్వరూపంగానే చేసి తనలోనే లయం చేసు కుంటున్నది.

ఆ జగన్మాత 'పంచమీ, పంచభూతేశీ, పంచసంఖ్యోపచారిణీ' అని పిలువబడుతూ, 'ఒరేయ్! నాయనా! ఈ జగత్తంతా కూడా ఐదింటితోనే కూడుకుని వున్నదిరా! నువ్వు, యీ జగత్తూ కూడా పంచ మహాభూతాలతోనే నిర్మిత మయ్యిందిరా! కానీ యీ అయిదింటినీ కూడా ప్రకాశింపజేసే ఆ పరమాత్మని తెలుసుకోరా! ఆ 'ఆత్మశక్తి', లేక 'చైతన్యం'

వుంటేనే యీ యావత్ ప్రకృతీ ప్రకాశిస్తోందిరా!' అని తెలుపుతోంది అమ్మ. అందుకనేనేమో, మనకి ఐదు వ్రేళ్ళున్నా, ఆ అయిదింటికీ ఆధారం **అంగుష్ఠం** (అంటే బొటనవ్రేలు) అయింది. అది లేకపోతే యీ మిగతా వ్రేళ్ళతో మనమేమీ చేయలేము కదా! అందుకనే పరమాత్మని 'అంగుష్ఠ మాత్రుడి'గా వర్ణించారు! సమస్త జగత్తుకి ఆధారం ఆయనేగా! మనం చూపుడు వేలుతో ఎదుటి వాడి తప్పనెంచాలని చూస్తే, మూడు వ్రేళ్ళు మనవైపు తిరిగి 'ఒరేయ్, త్రిగుణాలకీ దాసుడయిపోయి, తప్పలన్నీ నువ్వు చేస్తూ ఎదుటి వాళ్ళలో తప్పలెందుకురా వెదుకుతావు?' అని మనకి బోధిస్తున్నాయి.

'పంచభూత స్వరూపిణీ, పంచతన్మాత్ర స్వరూపిణీ, పంచకోశ స్వరూపిణీ - అన్ని స్వరూపాలూ నేనే, నేనే, నేనేరా, అన్నిటికీ ఆధారం నేనేరా' అంటోంది అమ్మ. **మాభై మాభైర్ఘోషిణీమా**, 'భయపడకు నాయనా భయపడకురా!' అని ఘోషిస్తోంది ఆ తల్లి. 'ఈ ప్రకృతిని చూసి భయపడకురా! ఇదంతా నా స్వరూపమేరా! నేనున్నాను నిన్ను దరి చేర్చడానికి. నా స్వరూపమే ప్రేమరా!' అని అభయమిస్తోంది ఆ **ప్రేమమయీ మా ! మధుమయీ మా!**

'అమ్మ' అని మనం ప్రేమమీరా, మనసారా పిలిస్తే పరుగు పరుగున వచ్చి రక్షిస్తుంది ఆ తల్లి. అయిదు నెలల పసిపిల్లవాడు ఏడుస్తూ వుంటే వాడికి పాలే యివ్వాలో, తడిసిన బట్టలే మార్చాలో తల్లికి తెలియదా? మరి కర్మ తల్లికే తన కర్మ పుత్రులపై యింత ప్రేమ వుంటే, జగత్తంతటికీ తల్లియైన జగన్మాత ప్రేమని ఏమని వర్ణించగలము? ఆవిడ గుణమే ఉపకారం చేయడం. ఆవిడ తిరిగి మననుండి ఏమీ కోరదు. విషయాదులతో నిండిపోయిన మన మనస్సులని ఖాళీ చేసుకుని 'అమ్మా రావే!' అంటే మన హృదయ సింహాసనాన్ని అధిష్ఠిస్తుంది ఆ **శ్రీమాత, శ్రీమత్ సింహాసనేశ్వరి!** మనం చేసిన తప్పలన్నీ ఒప్పకుని, క్షమించమని ప్రార్థిస్తే, ఆవిడ మనపై కృపావర్షం వెదజల్లుతుంది. "అయ్యో! మీరు కాళీ మాతని ఉపాసిస్తున్నారా? ఆవిడ విరుచుకు తింటుందిటగా!" అంటారు. కొంతమంది తెలియని మూర్ఖులు! ఏ తల్లయినా తన పిల్లలను విరుచుకు తింటుందా? ఆవిడ మనలోని నల్లనయిన చెడు భావనలనే కాలుష్యాన్ని, కబళించే కాలాన్ని హరించేది కనుక 'కాళీ' అయింది.

ఈ విధంగా ఆ 'అమ్మ' యొక్క నిజతత్వాన్ని తెలియ చేసేటివాడే సమర్ధుడయిన సద్గురు మూర్తి. జగజ్జనని గురురూపంలో వచ్చి చెప్పకున్న ఆవిడ తత్వం మనకేమి తెలుస్తుంది? అందుకనే ఆవిడ **శ్రీ గురురూపిణి కృపామయీమా!**

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***మే 2024 :*** AS 8720-8725, 8853, 9045, 9218; LM 4435, 4436, 4443, 4444

***జూన్ 2024 :*** AS 7173, 7230, 8473, 9069, 9072, 9220 LM 4438, 4440, 4445, 4446, 4449

## *పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు*

* ***ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును*** *

**మే 2024**

3 శుక్ర: శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ

12 ఆది: శ్రీ శంకర జయంతి - శ్రీ సద్గురు పాదపూజ.

23 గురు: వైశాఖ (గురు) పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ.

**జూన్ 2024**

1 శని : శ్రీ గురుదశమి, హనుమజ్జయంతి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

21 శుక్ర: జ్యేష్ట పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ.

# భక్తి

సేకరణ- సాయి కృష్ణ

భక్తి అంటే ఎలా వుండాలి - ఒకసారి చూద్దాం!

పూర్వం బెజ్జ మహాదేవి అనే భక్తురాలు ఉండేది. ఆమె ఒకనాడు ఇలా అనుకుంది, 'శివునికి అందరూ ఉన్నారు, కానీ అమ్మా, నాన్నా మాత్రం లేరు. చచ్చిపోయారో ఏమో పాపం, మా అమ్మ పోతే నాకెంత దుఃఖమో, ఆయనకూ అంత బాధే ఉండాలి కదా! తల్లి వుంటే శివుణ్ణి సన్యాసి కానివ్వదు, తల్లి వుంటే తల జడలు కట్టనివ్వదు, అమ్మ వుంటే విషం తాగనిస్తుందా! అలా తోలు కట్టుకొని తిరగనిస్తుందా, పాములు మెడలో వేసుకుని, వంటికి బూడిద పూసుకుని తిరుగుతుంటే చూస్తూ ఊరుకుంటుందా! తల్లి వుంటే శివునికి తిరిపమెత్తుకు తిరిగే కర్మమెందుకు పడుతుంది అనాథలా వల్లకాటిలో ఎందుకు తిరిగే వాడాయన?'

దానితో ఆమెకు శివుడి మీద మాతృత్వ భావన కలిగింది, 'అమ్మానాన్నలు లేని ఆ శివయ్యకి ఇక నుంచి అమ్మయినా, నాన్నయినా నేనే' అని అనుకుంది. బెజ్జ మహాదేవి శివలింగ మూర్తిని కాళ్ళ మీద పడుకోబెట్టుకొని, నీళ్ళు పోసి తుడిచి వస్త్రాలు చుట్టి, భస్మం పెట్టి, కాటుక బెట్టి పాలు తాగిస్తూ పెంచసాగింది. ఆమె ముగ్ధ భక్తికి శివుడు మెచ్చి అన్ని ఉపచారాలూ స్వీకరించసాగాడు. ఒకనాడు ఆమెను పరీక్షింప దలచి పాలు తాగడం మానివేశాడు. బెజ్జ మహాదేవి దానికి భయపడి పోయింది. 'అయ్యో! బిడ్డడికి అంగిట్ల ముల్లయింది' అని ఏడ్చింది.

'అడ్డమైన ప్రతి భక్తుడి ఇంటికి తిరిగి ఏది పెడితే అది తిని వస్తావు, ఎక్కడ గొంతునొచ్చిందో ఏమో'నని పుత్రవాత్సల్యం చూపిస్తూనే ఆయనకు కలిగిన కష్టానికి కుమిలిపోయింది. శివుడు పాలు, వెన్నా ఏమీ ముట్టక పోయేసరికల్లా 'ఇక మాటలతో పనిలేదు బిడ్డా! నీ బాధ చూస్తూ నేను బతికి ఉండి మాత్రం ఏమి లాభం' అని తల నరుక్కోడానికి సిద్ధపడింది.

ఆమె అవ్యాజ ప్రేమానురాగాలకు, నిష్కల్మష భక్తికి ఉబ్బి శంకరుడు మరింతగా ఉబ్బిపోయాడు! వెంటనే ఆమె ముందు ప్రత్యక్షమై 'వరాలు కోరుకో'మన్నాడు, అప్పుడు బెజ్జ మహాదేవి "కన్న ప్రేమకంటే

ఈ పెంచిన ప్రేమయే గొప్పది, నీవు నా కొడుకువు. నీ ముఖాన్నే శాశ్వతంగా చూస్తూ ఉండేటట్లు అనుగ్రహించు” అంది. శివుడందుకు సంతోషించి ఆమెకు నిత్యత్వాన్ని ప్రసాదించాడు. శివునికి తల్లి అయిన కారణంగా ఆమె అమ్మవ్వ అనే పేర ప్రసిద్ధురాలైంది.

భగవంతుడిని అదివ్వు, ఇదివ్వు అని కోరుకునేవారే కానీ, ఆయనకు అమ్మానాన్నా అయి, ఆలనాపాలనా చూసేవారెవరుంటారు, అసలంతటి నిష్కల్మషమైన భక్తి ఎవరికి ఉంటుంది, అందుకే శివుడు ఆమెను అమ్మలా ఆదరించాడు, నాన్నలా తన గుండెలో నిలుపుకున్నాడు. భక్తి అంటే అలా ఉండాలి!

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమనివాసులు అయిన శ్రీమతి చుండూరి అన్నపూర్ణమ్మగారు 28-3-2024 గురువారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 87 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు శ్రీ వారణాసి అనంత పద్మనాభ శాస్త్రిగారు 28-3-2024 గురువారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 87 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

# భవరోగ వైద్యం

- పాలూరి కాళీప్రసాద్

గురుదేవులు అంటే భవరోగ వైద్యులు అని మనందరికీ తెలిసిందే కదా! భవం అంటే పుట్టుక. అంటే ఈ సంసారచక్రంలో మళ్ళీ మళ్ళీ పుడుతూ చస్తూ ఉండటమే భవరోగం. ఈ రోగానికి మూల కారణం అజ్ఞానం. అలాగే కామక్రోధాది ఆరు దుర్గుణాలు, అహంకార మమకారాలు ఈ రోగ లక్షణాలు. శారీరక రోగం వచ్చినవాడు తాను మాత్రమే బాధపడితే, ఈ భవరోగం వలన దుర్గుణాలు ప్రేరేపించినవాడు తన చుట్టూ ఉన్నవారందరినీ బాధపెడతాడు.

సాధారణంగా రోగం వచ్చినవాడు తనకు తెలిసిన మందులు వాడటమో, లేదా ఎవరైనా తెలిసిన వాళ్ళు చెప్పినవో, ఎక్కడైనా చదివినవో మందులు వాడటమో చేస్తాడు. అప్పటికీ రోగం తగ్గకపోతే వైద్యుని దగ్గరకు వెళతాడు. ఆ రోగం తీవ్రత తక్కువగా ఉండి, రోగి తాను చెప్పిన పథ్యాన్ని పాటిస్తూ మందులు సరిగా వేసుకుంటాడని నమ్మకం కలిగితే వైద్యుడు అతనికి మందులిచ్చి, తగిన జాగ్రత్తలు చెప్పి ఇంటికి పంపేస్తాడు. అదే రోగం కొంచెం ఎక్కువగా ఉండో, లేక రోగి సరిగ్గా సూచనలు పాటించడనే అనుమానం కలిగితేనో అతనిని వైద్యశాలలోనే ఒక గదిలో ఉంచి తామే పర్యవేక్షిస్తూ రోగం తగ్గేంతవరకు వైద్యం చేస్తారు. ఇంకా రోగం బాగా ముదిరిపోయి నిరంతర పర్యవేక్షణ అవసరమైన రోగినయితే ఐసియూలో పెట్టి వైద్యం చెయ్యవలసి వస్తుంది. ఇలా రోగ తీవ్రతను బట్టి, రోగి మానసిక పరిపక్వతను బట్టి వైద్యం చేసే విధానం మారుతుంది కానీ ఆ వైద్యునికి ఏ ఒక్క రోగి పట్ల ప్రత్యేక అభిమానం కానీ, మరొక రోగి పట్ల ద్వేషం కానీ ఉండవు.

అలాగే మరి భవరోగ వైద్యులయిన గురుదేవులను ఆశ్రయించిన శిష్యులలో కుడా రోగ తీవ్రత, మానసిక పరిపక్వత, రోగం తగ్గించుకోవాలనే పట్టుదల వివిధ స్థాయిలలో ఉంటుంది. అసలు చాలామందికి తమకు ఒక రోగం ఉన్నదనే తెలియకపోవచ్చు. కానీ గురువుకు శిష్యునికి ఉండే సంబంధం ఎన్నో జన్మలనుంచి పెనవేసుకొని ఉంటుంది. శిష్యునికి తెలిసినా, తెలియకపోయినా, సాధన సరిగా చేసినా, చేయకపోయినా గురువు మాత్రం శిష్యుని విడిచిపెట్టడు.

అయితే తన భవరోగాన్ని గుర్తించి, గురు ముఖస్తుగా వచ్చిన ఏ చిన్న వాక్యాన్ని అయినా గురు ఆజ్ఞగా భావించి, శిరసావహించి చక్కగా సాధన చేసుకొనే ఉత్తమ శిష్యుడు, గురువుకు భౌతికంగా ఎంతో దూరంలో ఉన్నా తరిస్తాడు.

కానీ కామక్రోధాది గుణాలు తరచుగా విజృంభిస్తూ, గురుసన్నిధి ఒక్క క్షణం దూరమైనా మళ్ళీ మాయలో పడిపోయి తాను దిగజారి పోతూ, ఇతరులకు కూడా కష్టాన్ని కలిగించే స్థితిలో ఉన్న శిష్యుని మరి గురువు నిరంతరం తన సన్నిధిలో ఉంచుకొని పర్యవేక్షించ వలసిందే కదా. అయితే మానసిక పరిపక్వత లేని ఆ శిష్యుడు తనను గురువు నిరంతరం సన్నిధిలో ఉంచుకోవడాన్ని తన గొప్పగా భావించి, అహంకారాన్ని పెంచుకొని, ఇతర శిష్యుల మీద పెత్తనం చలాయించాలని చూసే సందర్భాలు కూడా ఉంటాయి. అయితే గురుదేవులు మాత్రం ఆ శిష్యుని ఎలాగైనా ఉద్ధరించి తరింపజేయాలనే చూస్తారు. 'తనకు అత్యంత సమీపంలో ఉంటేనే ఇంతగా మాయకు వశుడైపోతున్నాడే, ఇక తనకు దూరమైతే ఇంకెంత దిగజారుతాడో' అని బాధ పడతారు.

అయితే ఈ విషయాన్ని గుర్తించని ఇతర శిష్యులు గురువును అపార్థం చేసుకుంటారు. ఆ శిష్యుడు ఎన్ని దుష్కార్యాలు చేస్తున్నా గురువు అతనిని దండించడం లేదని అలుకబూనుతారు. భవరోగ వైద్యులయిన గురుదేవుల వద్ద శిక్షణే కానీ శిక్ష ఉండదు. పద్మం వికసించినప్పుడు తుమ్మెద ఎంతో దూరంనుంచి వచ్చి ఆ మకరందాన్ని గ్రోలి ఆ మాధుర్యాన్ని చక్కగా ఆస్వాదించి ఎగిరిపోతుంది. అదే పద్మం మొదలులో నివసించే కప్పకి ఆ మకరందంలోని మాధుర్యం తెలియకపోగా, తాను బురదలో పొర్లుతూ ఆ బురదనే పద్మానికి పూయాలని చూస్తుంది. అయితే అది పద్మానికి అంటుకోదు కదా! కానీ ఈ తుమ్మెద ఆ కప్పమీద కోపం తెచ్చుకొని దానికి ఆశ్రయం ఇచ్చినందుకు పద్మం వద్దకు రాకుండా దూరమైపోతే ఎవరికి నష్టం?

అలాగే గురుదేవులు ఎందుకు ఒక శిష్యుని తమకు దగ్గరగా ఉంచుకుంటున్నారో తెలుసుకోకుండా, ఆ శిష్యుని వలన తనకు ఏదో బాధ కలిగిందని, ఆ శిష్యుని గురువులు తప్పక దండించి తీరాలని బలంగా విశ్వసించి, అది జరగనందుకు తాను గురువుకు దూరమైపోతే

నష్టం ఎవరికి? అలా కాక, తనకు కలిగిన కష్టాన్ని గురుదేవుల సమక్షంలో విన్నవించుకొని, ఆ శిష్యునిపై తీసుకోవలసిన చర్యను గురుదేవులకే వదిలిపెట్టి, నిర్వికారంగా తన వంతు సేవ తాను చేసుకుంటే తనకే మంచిది. ఏ శిష్యులకు ఎలా శిక్షణ ఇవ్వాలో గురుదేవులకు మించి ఎవరికి తెలుస్తుంది?

ఒకసారి శ్రీ బాబూజీ మహరాజ్ వారు శిష్యులందరికీ ప్రసాదం పెట్టిన తరువాత వారందరూ అక్కడే ఉన్న వాష్‌బేసిన్‌లో చేతులు కడుక్కుంటున్నారు. శ్రీ లలితానంద సరస్వతీ స్వామిని వారి వంతు వచ్చేసరికి శ్రీ బాబూజీ మహరాజ్ వారు తీవ్ర స్వరంలో "ఈ వాష్‌బేసిన్ నాకోసం కానీ అందరూ ఉపయోగించడానికి కాదు. బయటకు వెళ్ళి అక్కడ ఉన్న వాష్‌బేసిన్‌లో చేతులు కడుక్కో" అని హెచ్చరించారు. అక్కడున్న శిష్యులు అందరూ విస్తుపోయారు. ఆమె బయటకు వెళ్ళగానే శ్రీ గురుదేవులు "చూశారా? ఆమె ముఖంలో కానీ, మనస్సులో కానీ ఇంతమంది ముందు నన్ను అవమానిస్తున్నారు అని గానీ, లేదా వారందరికీ లేని అభ్యంతరం నా విషయంలోనే ఎందుకు అనే భావం కానీ ఏ మాత్రం కలుగలేదు. ఆమె అంతటి స్థితప్రజ్ఞ స్థితిని సాధించారు. కనుకనే నేను అలా అనగలిగాను. అదే మీలో ఎవరినైనా నేను అలా అంటే మీరు మళ్ళీ రెండవరోజు నా దగ్గరికి వస్తారా? శిష్యుని మానసిక పరిపక్వతను బట్టే గురుదేవుల ప్రవర్తన ఉంటుంది" అని వివరించారు.

కాబట్టి ఏ శిష్యునికి ఎలాంటి శిక్షణను ఇవ్వాలో, ఎవరి తప్పులను ఎలా సరిదిద్దాలో గురుదేవులకే వదిలిపెట్టి సర్వ సమర్పణ భావంతో వారిని సేవించుకోనడమే శిష్యుని కర్తవ్యం. ఏ రోగికి ఎలాంటి వైద్యం చేయాలో వైద్యునికి ఇంకొక రోగి చెప్పలేడు కదా!

# వాల్మీకి రచనా వైశిష్ట్యం

సేకరణ - పద్మ (బరోడా)

వాల్మీకి మహర్షి రచనా వైవిధ్యంలో ఒక అద్భుతం వుంది.

బాల కాండలో **'తపస్'** అనే పదంతో ప్రారంభమవుతుంది -

1. వాల్మీకి తపస్సు చేశాడు. 2. విశ్వామిత్రుడు తపస్సు చేశాడు. 3. భగీరథుడు తపస్సు చేశాడు. 4. పార్వతి తపస్సు చేసింది. 5. అహల్య తపస్సు చేసింది. ఇంకా ఎందరో మునులు తపస్సు చేశారు.

ఇక అయోధ్య కాండ **'గచ్ఛతా'** తో మొదలవుతుంది -

1. భరతుడు మేనమామ గారింటికి వెళ్ళాడు. 2. సీతారామలక్ష్మణులు వనవాసానికి వెళ్ళారు. 3. దశరథుడు ఈ లోకమే విడిచి పోయాడు. 4. భరతుడు చిత్రకూటం వెళ్ళి- తర్వాత నందిగ్రామం వెళ్ళాడు.

ఇక అరణ్యకాండ **'ప్రవిశ్య'** తో ప్రారంభం అవుతుంది -

1. సీతారామలక్ష్మణులు దండకారణ్యంలో ప్రవేశిస్తారు, 2. విరాధుడు, 3. శరభంగుడు, 4. సుతీక్షణుడు, 5. అగస్త్యుడు, 6. జటాయువు, 7. శూర్పణఖ, 8. ఖరదూషణులు, 9. మారీచుడు, 10. రావణుడు, 11. కబంధుడు, 12. శబరి ఇత్యాదులు ప్రవేశిస్తారు.

కిష్కింధ కాండ **'విలాప'**- తో ప్రారంభం అవుతుంది -

1. సీతావియోగంతో రాముడు విలపించాడు. 2. సుగ్రీవుడు తన భార్య కోసం విలపించాడు. 3. నగల మూట చూసి మళ్ళీ విలపించాడు రాముడు. 4. తార విలపించింది. అలా ఈ కాండలో అందరి ఇంద్రియాలు వ్యాకులమైనాయి.

సుందర కాండ **'శత్రుకర్షణ'** తో ప్రారంభం అవుతుంది -

హనుమంతుడు శత్రుకర్షణుడు. 1. ఛాయాగ్రాహిని చంపాడు. 2. లంకిణి పీచమణచాడు. 3. అశోకవనం ధ్వంసం చేశాడు. 4. జంబుమాలిని చంపాడు. 5. రావణ మంత్రుల్ని చంపాడు. 6. సేనాపతుల్ని చంపాడు. 7. అక్షకుమారుని చంపాడు. 8. రావణ మూలబలంలో పాతిక భాగం చంపేశాడు. శత్రుకర్షణుడంటే బాహ్యమైన శత్రువులనే కాదు, కామక్రోధాది అంతశ్శత్రువుల్ని అణచిన వాడు హనుమంతుడని మరో రకంగా అన్వయించవచ్చు.

ఇక యుద్ధకాండ సరేసరి. అలా ప్రతికాండలోని మొదటి శ్లోకంలో మొదటి పదంలో ఆయా వ్యక్తులగూర్చి నిక్షిప్తం చేయడం వాల్మీకి మహర్షి శిల్ప చాతుర్యం. అదే ఒక శైలీ విన్యాసం.

# నేను లేకపోతే?

సేకరణ- బొంబాయి కృష్ణారావు

అశోక వనంలో రావణుడు సీతమ్మ వారి మీదకోపంతో కత్తి దూసి, ఆమెను చంపటానికి ముందుకు వెళ్లినప్పుడు హనుమంతుడు అనుకున్నాడు 'ఎవరి నుంచైనా కత్తిని తీసుకుని రావణాసురుని తలను ఖండించాలి' అని. కానీ మరుక్షణంలోనే మండోదరి రావణుడి చేతిని పట్టుకొని ఆపడాన్ని చూసి ఆశ్చర్య చకితుడయ్యాడు! 'నేనే కనుక ఇక్కడ లేకపోతే, సీతమ్మను రక్షించే వారెవరు? అనేది నా భ్రమ అన్నమాట' అనుకున్నాడు హనుమంతుడు!

బహుశా మనం కూడా ఎన్నోసార్లు ఇలానే అనుకుని ఉంటాం, 'నేను లేకపోతే ఎలా?' అని. సీతామాతను రక్షించే పనిని, ప్రభువు ఏకంగా రావణుని భార్యకు అప్పగించాడు. అప్పుడు హనుమంతుడికి అర్థమైంది 'ఎవరి ద్వారా ఏ కార్యాన్ని చేయించుకోవాలో వారి ద్వారానే ప్రభువు ఆ పని చేయించుకుంటాడు' అని.

మరింత ముందుకు వెళితే, త్రిజట 'తనకు ఒక కల వచ్చిందని, ఆ కలలో లంకకు ఒక కోతి వస్తుందనీ, అది లంకను కాల్చివేస్తుందనీ, దాన్ని నేను చూశాను' అనీ చెప్పింది. అయితే హనుమంతుడికి ఇది చాలా ఆశ్చర్యం అనిపించింది. ఎందుకంటే ప్రభువు తనను సీతను చూసి మాత్రమే రమ్మన్నాడు, అంతేకానీ లంకను కాల్చి రమ్మని చెప్పలేదు. తాను లంకను కాల్చడం ఎలా సాధ్యం? అనుకున్నాడు. అయితే త్రిజట ఇది తన స్వప్నంలో చూశానని చెప్పింది. హనుమంతుడు ధర్మ మీమాంసలో పడ్డాడు. తను ఇప్పుడు ఏం చేయాలి? సరే, ప్రభువు ఇచ్ఛ ఎలా ఉంటే అలా జరుగుతుంది అనుకున్నాడు.

హనుమంతుని చంపడానికి రావణుడి సైనికులు పరిగెత్తుకొని వస్తున్నప్పుడు, హనుమంతుడు ఏమీ చేయలేదు. అలా నిలబడ్డాడు. అయితే ఆ సమయంలో విభీషణుడు వచ్చి 'అన్నా! దూతను చంపటం నీతి కాదు' అన్నాడు. అప్పుడు హనుమంతునికి అర్థమైంది, తనను రక్షించే భారం ప్రభువు విభీషణునిపై ఉంచాడు అని. ఆశ్చర్యానికి పరాకాష్ట ఎక్కడంటే, విభీషణుడు ఆ మాట చెప్పగానే రావణుడు ఒప్పుకుని 'కోతిని చంపొద్దు. కోతులకు తోకంటే మహా ఇష్టం, తోకకు నిప్పు పెట్టండి'

అన్నాడు. అప్పుడు హనుమంతుడికి మరింతగా అర్థమైంది త్రిజట స్వప్నం నిజం కాబోతుంది అని. 'ప్రభువు నాకే చెప్పి ఉంటే, నేను ఎక్కడి నుంచి నూనె తీసుకురావాలి, ఎక్కడి నుంచి గుడ్డలు తీసుకురావాలి, ఎక్కడి నుంచి నిప్పు తీసుకురావాలి, ఎప్పుడు లంకను తగలబెట్టాలి!' ఆలోచనల వరంపరతో ఆశ్చర్యంలో మునిగిపోయాడు. పరమాశ్చర్యం ఏంటంటే, వాటన్నిటికే ఏర్పాట్లు రావణుడే స్వయంగా చేయించాడు. అంటే, రావణునితో కూడా తన పనిని చేయించుకోగలిగిన తన ప్రభువు తనకు 'లంకను చూసి రా' అని మాత్రమే ఆజ్ఞాపించడంలో ఆశ్చర్యం ఏముంది!

అందుకే ప్రియ భక్తులారా! ఒకటి గుర్తుంచుకోండి. ప్రపంచంలో జరుగుతున్నదంతా ఈశ్వరేచ్ఛ ప్రకారమే జరుగుతుంది. మనమంతా కేవలం నిమిత్తమాత్రులం. అందువల్ల 'నేను లేకపోతే ఏమవుతుందో' అన్న భ్రమలో ఎప్పుడూ పడవద్దు. 'నేనే గొప్పవాడి'నని గర్వపడవద్దు. భగవంతుడి కోటానుకోట్ల దాసులలో అతి చిన్నవాడను అని ఎఱుక కలిగి ఉందాం.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్‌శాఖవారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......**

**మే 2024**

3 శుక్ర: శ్రీ గురుదశమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

12 ఆది: శ్రీ శంకర జయంతి - ఉ.11.00 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

23 గురు: వైశాఖ పూర్ణిమ - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

**జూన్ 2024**

1 శని : శ్రీ గురుదశమి, హనుమజ్జయంతి - ఉ.11.00 గం.లకుసత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ. భక్త సమారాధన.

21 శుక్ర: జ్యేష్ఠ పూర్ణిమ - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

# గురుర్వినా గతిర్నాస్తి

సేకరణ - రెడ్డి శ్రీదేవి

"గురుర్వినా గతిర్నాస్తి" - గురువు తప్ప మరొక గతి లేదు అనేది అర్థమై ఆచరించ గలిగితే అసాధ్యం లేదు. గురువు నీ చేతిని పట్టుకోవాలంటే ఆ అర్హతను నువ్వు సాధించుకోవాలి. గురువు ఎప్పడూ పరమ ప్రేమ స్వరూపమే. అందులో సందేహం లేదు. ఎల్లప్పడూ శిష్యుని అభ్యున్నతిని కోరుతారు గురువు. అందులో సందేహం లేదు. అయితే గురువు ప్రసరించే ప్రేమ, శక్తిని అందుకునే స్థాయి శిష్యునికి వుండాలి. అదెలా వస్తుంది?

గురువు మాత్రమే తనను ఉద్ధరించగలడు అనే పరిపూర్ణ విశ్వాసాన్ని కలిగి వుండటమే ఆ స్థాయిని అందిస్తుంది. కానీ మనం ఏమి చేస్తున్నాం? ఏదో ఒక సమస్య పరిష్కారానికి గురువును ఆశ్రయించి వుంటున్నాం. ఆ సమస్య తీరితే ఆ గురువు గొప్పవాడు. తీరకపోతే మరో గురువు. ఇలా కొట్టుకు పోతున్నాం. గురువు నీ సమస్యని ఖచ్చితంగా పరిష్కరిస్తారు. ఆ శక్తి గురువులో వుందని నువ్వు మనసా, వాచా, కర్మణా నమ్మాలి. అప్పడే అది సాధ్యం అవుతుంది. గురువు కూడా నీలాగా మామూలు మనుషిలాగే వుంటారు, లోకంలో అందరిలాగే వ్యవహరిస్తారు, అందరిలాగే ఇబ్బందులూ పడతారు. కానీ ఆ గురువు, తన గురువు మీద అచంచలమైన విశ్వాసంతో వుంటారు. తనని తాను తన గురువు చేతిలో పరికరంగానే భావించుకుంటారు (అర్జునుని వలె). అందుకే, ఆ సేవాభావం వల్లనే, ఆ సర్వస్వశరణాగతి వల్లనే గురువు శక్తిమంతులు అవుతారు .

నీ సమస్యని తీర్చే శక్తిని తన గురువు తనకి అందిస్తాడనే విశ్వాసమే నీ గురువులోని శక్తి. కనుక నువ్వు ఎప్పడు గురువే సర్వస్వం అని నమ్మితే అప్పడే నీ గురువు నీ చేతిని పట్టుకుని నడిపిస్తారు. నమ్మకం అచంచలంగా వుందా నీలో? ఆ ప్రశ్నకి ఎవరికి వారే సమాధానం చెప్పకోవాలి. గురువు మార్గాన్ని చూపిస్తారు, ఆ మార్గంలో నడవటం నీ పని. గురువు జ్ఞానాన్ని అందిస్తారు, ఆ జ్ఞానాన్ని జీవితంలో భాగం చేసుకోవటం నీ పని. గురువు ప్రేమని ప్రసరిస్తారు, ఆ ప్రేమని నీలో నింపుకోవడం నీ పని.

గురువు దగ్గరకి వెళ్ళేటప్పడు నీ బుద్ధిని, నీ తెలివితేటలను పక్కనపెట్టి వెళ్ళాలి. గురువుతో వాదన పనికిరాదు. గురువు చెప్పే మాటలను చెవులతో కాదు, మనసుతో వినాలి. గురువును నమ్మినప్పడు కళ్ళు మూసుకొని, ఇతర చింతనలు లేకుండా నమ్మాలి. గురువుకు నిన్ను నువ్వు సమర్పించుకోవడం

అంటే నీ హృదయాన్ని పూర్తిగా తెరిచి సమర్పించాలి. గురువు ఉపదేశాన్ని వినేటప్పుడు నోరు మూసుకొని వినాలి. గురువును ఏదైనా కోరేటప్పుడు కొంగు చాచి అడగాలి. ఇవన్నీ చేయగలిగితే గురువు నీ వాడు అవుతాడు. ఒక గురువు, ఆ గురువు అనే స్థితికి ఎలా చేరారు?

తన జీవితాన్ని తన గురువు చరణాల వద్ద సమర్పించటం వల్ల, తన జీవితంలోని చిన్న చిన్న సంతోషాలను కూడా వదులుకొని తన గురువును సేవించటం వల్ల, తన వృత్తి - ఉద్యోగ - వ్యాపారాదులను తృణప్రాయంగా వదలి, తన గురువుకు అంకితం కావటం వల్ల మాత్రమే అది సాధ్యం అవుతుంది. అప్పడే గురుకృప లభిస్తుంది. ఆ గురుకృప ఆ వ్యక్తిని కూడా గురుస్థానంలో నిలుపుతుంది. అయితే ఆ వ్యక్తి తనకు గురుత్వస్థాయిని కోరుకొని చేశాడా? కానే కాదు. తన ఆత్మోన్నతి కోసమే చేస్తాడు. అది సఫలం అయినప్పుడు, గురువే ఆ వ్యక్తిని తన పరికరంగా, ఆయుధంగా లోకానికి సమర్పించి, ఆ వ్యక్తిని గురువుగా నిలుపుతాడు. తన పరికరంగా, తన బాధ్యతలను ఆ వ్యక్తి ద్వారా నెరవేరుస్తారు. (శ్రీకృష్ణ - అర్జునుల వలె).

అందువల్ల ఇప్పుడు మీ ముందు సమర్థుడైన గురువుగా నిలిచిన వ్యక్తికి ఆ స్థాయిని అందుకున్నాక కూడా వ్యక్తిగత జీవితం మిగలదు. అది తెలుసుకోగలిగితే ఒక గురువు పట్ల మనం ఎలా ప్రవర్తించాలో అర్థం అవుతుంది. నువ్వు లౌకికంగా అత్యున్నత విద్యావంతుడివి కావచ్చు. కానీ గురువు ముందు అనుక్షణమూ నీకు అక్షరాభ్యాసమే! నువ్వు సమాజంలో గురువు కన్నా ఉన్నత స్థాయిలో వుండవచ్చు. కానీ గురువు ముందు నువ్వు కేవలం ఒక సేవకుడివే. నువ్వు గురువు కన్నా అత్యధిక ధనవంతుడివి కావచ్చు. కానీ గురువు ముందు నిరుపేదవే. నువ్వు గురువు కన్నా అధిక లౌకిక జ్ఞానం కలవాడివి కావచ్చు. కానీ గురువు ముందు నువ్వు పరమ అజ్ఞానివే. నీ లౌకిక విద్య గురువు ముందు నిరక్షరాస్యతగా మిగులుతుంది. సమాజంలో నీ స్థాయి గురువు ముందు నిష్ప్రయోజనంగా మిగులుతుంది. నీ ధన సంపద అంతా గురుచరణ ధూళిని కూడా తాకలేదు. నీ లౌకిక జ్ఞానం సమస్తం గురువు అలౌకిక జ్ఞానం ముందు గుడ్డి గవ్వకు కూడా పనికిరాదు, ఈ విషయాన్ని మనస్సులో స్థిరంగా నిలుపుకోగలిగితే గురువు నీ వాడు అవుతాడు!

- సశేషం

# యద్భావం తద్భవతి

ఒక మనిషి చనిపోయాడు. దేహంలోంచి ఆత్మ బయటకు వచ్చింది. చుట్టూ చూశాడు. చేతిలో పెట్టెతో దేవుడు తన దగ్గరకు వచ్చాడు. చనిపోయిన మనిషికీ భగవంతుడుకి మధ్య సంభాషణ ఇలా సాగింది.!! దేవుడు: మానవా! నీ శరీరం పడిపోయింది, ఇక ఈ జన్మ ముగిసింది, నాతో పద.

మనిషి: అయ్యో ఇంత త్వరగానా? నేను భవిష్యత్తు గురించి ఎన్నో కలలు కన్నాను స్వామీ! దేవుడు: తప్పదు నాయనా! నీవు నాతో రావాల్సిన సమయం వచ్చింది. మనిషి: నాకోసం తెచ్చిన ఆ పెట్టె ఇటివ్వండి, ఏం తెచ్చారో చూస్తాను. దేవుడు: నీకు చెందినవే వున్నాయి. అవి నువ్వు కూడబెట్టుకునీ, సంపాదించుకొన్నవే. మనిషి: నావా? అంటే నా బట్టలు, డబ్బులు, భూమి పత్రాలు అవా? దేవుడు: అవెప్పటికీ నీవి కావు. అవన్నీ భూమివే. ఇక్కడే ఉంటాయి. మనిషి: పోనీ నా జ్ఞాపకాలున్నాయా దాన్లో? దేవుడు: కాదు, జ్ఞాపకాలనేవి కాలానికి చెందినవి, కాలగర్భంలోకి వెళ్ళిపోతాయి.

మనిషి: అయితే నా ప్రతిభ, ప్రజ్ఞ ఉండి ఉంటాయి! దేవుడు: అవి పరిస్థితులవి, నీవి కావు. మనిషి: నా స్నేహితులున్నారా అందులో? దేవుడు: వారు కేవలం నీతో కొద్ది దూరం కలిసి వచ్చే తోటి ప్రయాణికులు మాత్రమే! మనిషి: నా భార్య, బిడ్డలునా? దేవుడు: వారు నీతో కలిసి ఒక నాటకంలో పాల్గొన్న పాత్రధారులు. మనిషి: అయితే నీవద్ద ఉన్న పెట్టెలో నా శరీరం ఉండుండాలి! దేవుడు: తప్పు, నీ శరీరం ధూళికి చెందినది, మట్టిలో పడుతుంది. మనిషి: స్వామీ అయితే నా ఆత్మా? దేవుడు: ఆత్మ నీదెలా అవుతుంది. అది నాది.

మనిషి: ఆ పెట్టె ఇటివ్వు స్వామి! అని తీసుకుని తెరిచి చూశాడు. కళ్ళలో నీళ్ళు సుడులు తిరిగాయి. ఆ పెట్టె ఖాళీగా ఉంది. కాలం చేస్తే తనతో తీసుకువచ్చేది ఏదీ వుండదు అని చెప్పేందుకే దేవుడు ఈ ఖాళీ పెట్టె తెచ్చాడని అర్థం అయింది. బతికున్నంత కాలం నా వాళ్ళు, అవన్నీ నావే, ఇవన్నీ నాకే అని ఆశతో, ఆరాటంతో పరుగులు పెడుతూ పరమాత్మ స్మరణ మరిచాను అని దుఃఖితుడయ్యాడు. స్వామీ! చివరగా అడుగుతున్నాను. నాది అనేది ఏమైనా ఉందా అసలు?

దేవుడు: ఉంది, నీవు జీవించినంతకాలం ప్రతి క్షణం నీదే. ఆ క్షణాల్లో నీవు ఆర్జించే మంచి, చెడు యొక్క పర్యవసానాలు నీకే చెందుతాయి. అందుకే ప్రతిక్షణం మంచిని పంచాలి పెంచాలి, భగవన్నామ స్మరణ చేయాలి. పశ్చాత్తాపులను క్షమించాలి. తోటివారి నుంచి మనకి సంక్రమించే భావాలను ఆనందించాలి. మానవసేవయే మాధవసేవ అని గుర్తించి జీవించాలి. సర్వే జనా సుఖినోభవంతు.


శాస్తి
ముకుంద్
అమ్మా! బాబూజీ స్నానానికి వెళ్తున్నారు. గోరువెచ్చని నీళ్ళు ఇవ్వండి!
పిఠాపురం రాజావారి దివాణం
1
ఈ మరిగే నీళ్ళు బాబుగారికి స్నానానికి పెట్టి తమాషా చూద్దాం!
2


ఓహెూ!!!


ఇదేంటి, ఈయన
ఏమీ జరగనట్లు
మామూలుగానే
ఉన్నారే?


సాయంత్రం
ఏమైందర్రా? ఎందుకలా అరుస్తున్నారు?
ఏమో తెలీదు అత్తయ్యగారు! మేము గోరువెచ్చటి నీటితోనే స్నానం చేశాం, కానీ ఒళ్ళంతా ఒకటే మంటలు!
5
తెలిసో తెలియకో మీరు బాబూజీ పట్ల ఏమైనా అపచారం చేశారా?
అదేమీ లేదు అత్తయ్యగారు! మేము ఏ పాపమూ ఎరుగం!
6


రాత్రి
ఇంకా మీ మంటలు తగ్గలేదంటే మీరు ఖచ్చితంగా ఏదో తప్పు చేశారు. నిజం చెప్పండి!
అవునండీ! మేము తమాషా చేద్దామని బాబుగారికి స్నానానికి మరిగే నీళ్ళు పెట్టాము. మమ్మల్ని క్షమించండి!
7


బుద్ధి గడ్డితిని మీపట్ల అపరాధం చేశాం. మమ్మల్ని క్షమించండి బాబూజీ!
అమ్మ దయ వల్ల మీలో మంచి మార్పు వచ్చింది. సంతోషం. ఇక ఈ మంటలు పోతాయిలే!
8

# శ్రీ కుసుమ హరనాథ్

సేకరణ - మురళీ

పశ్చిమ బెంగాల్ బంకూర జిల్లా సోనాముఖి గ్రామంలో 1 జూలై 1865న జన్మించారు శ్రీహరనాథ్. తండ్రి జయరాం బెనర్జీ, తల్లి సుందరీ దేవి. హరనాథ్ తండ్రి జయరామ్ బెనర్జీ కలకత్తా పర్యటనలో ఉన్నప్పడు ఒక సాధువు సోనాముఖిలోని తన ఇంటికి వెళ్లి తన భార్య సుందరీ దేవిని ఆతిథ్యం ఇవ్వాలని కోరినట్లు కల వచ్చింది. సాధువు యొక్క తేజస్సుకు పొంగిపోయిన ఆమె జయరామ్ నిర్మించిన శివాలయంలో ఆ సాధువుకు ఆశ్రయం కల్పించింది. ఆమె సాధువుకు అంకితభావంతో సేవ చేసి, సాయంత్రం పూజానంతరం ఆలయం వెలుపలి ద్వారాలకు తాళాలు వేసింది. మరుసటి రోజు ఉదయం సాధువు జాడ లేదు. ఆలయ గోడలు చాలా ఎత్తులో ఉన్నందున గోడ దూకి వెళ్ళే అవకాశం లేదు. జయరామ్ ఇంటికి తిరిగి వచ్చి కల విషయం భార్యకు చెప్పాడు. ముందురోజు సాయంత్రం నిజంగానే ఒక సాధువు సుందరి ద్వారా సేవలు అందుకున్నాడని తెలుసుకుని ఆశ్చర్యపోయాడు. ఈ సంఘటనల తరువాత, హరనాథ్ జన్మించాడు.

హరనాథ్ జీవితం ప్రారంభంలో చాలా విచిత్రమైన శక్తులను కనబరిచినట్లు చెబుతారు. అతని తల్లి సరదాగా వస్తువులను దాచిపెడితే, ఇంటికి ఎంత దూరంలో దాచిపెట్టినా ఖచ్చితంగా గుర్తించేవాడు. తరచుగా సమాధిస్థితిలోకి వెళ్తుండేవాడు. 1889లో కలకత్తాలోని బుర్ద్వాన్ రాజ్ కాలేజీలో డిగ్రీ చదువుతున్నప్పడు గాఢమైన పారవశ్యం పొందేవాడు. తన పరిసరాలను గుర్తించకుండా కలకత్తా వీధుల్లో తిరుగుతుండేవాడు. అతనికి ప్రాపంచిక విషయాల పట్ల అసలు ఆసక్తి ఉండేది కాదు. అతని మనస్సు నిరంతరం ఒక రహస్యమైన అంతర్గత శక్తితో రమిస్తూ ఉండేది. జీవితంలో ఎక్కువ భాగం ఆధ్యాత్మిక సత్యాల ఆలోచనలో గడిపాడు. ఈ కారణంగా అతను తన బి.ఎ. పరీక్షలో ఉత్తీర్ణుడు కాలేదు. అతను 14 సంవత్సరాల వయస్సులో కుసుమ కుమారి దేవిని వివాహం చేసుకున్నాడు. అప్పటికి ఆమె వయస్సు తొమ్మిది సంవత్సరాలు.

హరనాథ్ జీవనోపాధి కోసం కాశ్మీర్‌లో ప్రభుత్వ ఉద్యోగంలో చేరారు. 1893 నుండి 1913 వరకు 20 సంవత్సరాలు కాశ్మీర్‌లో

వుద్యోగం చేస్తూ భార్య మరియు ఇతర కుటుంబ సభ్యులకు చాలా దూరంలో నివసించాడు. తరచూ ధ్యానంలో నిమగ్నమయి ఉండేవారు. లేని సమయాలలో భక్తుల సమావేశాలు ఏర్పాటు చేసి భక్తులతో కృష్ణ నామం చేయిస్తూ దైవిక కార్యక్రమాలు నిర్వహించేవారు. కాలక్రమేణా ఎంతోమంది అనుచరులు, భక్తులు ఏర్పడ్డారు. వారు హరనాథ్ నామాన్ని కూడా జపిస్తూ ఉండేవారు. అట్టివారికి తన నామంతో తన భార్య కుసుమ పేరు కూడా చేర్చమని సూచించారు. అప్పటి నుంచి "కుసుమ హరనాథ్"గా ప్రసిద్ధి చెందారు. ఈ మంత్రం యొక్క అద్భుతమైన శక్తి అతని మరణం తర్వాత అందరికీ అనుభవమయ్యింది.

16వ శతాబ్దంలో చైతన్య మహాప్రభువు (గౌరాంగుడు) యావత్ భారతదేశాన్ని కృష్ణనామ పారవశ్యంతో ఉర్రూతలూగించి 1592లో స్వస్థానం చేరుకున్నారు. శతాబ్దాలు గడిచే కొద్దీ కృష్ణ నామ ప్రచారం తగ్గటంతో 273 సం.ల తర్వాత చైతన్య మహాప్రభువే హరనాథ్‌గా తిరిగి జన్మించారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. హరనాథ్ మానవాతీత శక్తులను ప్రదర్శించాడు. అది అన్ని రకాల ప్రజలను ప్రభావితం చేసింది. దుర్మార్గులను సాధువులుగా, క్రూరమైన జంతువులను హానిచేయని సహచరులుగా మార్చిన సంఘటనలు అనేకం. తన భక్తులను, స్నేహితులను రాబోయే ప్రమాదాల గురించి హెచ్చరించి వారికి హాని కలగకుండా రక్షిస్తుండేవారు. శారీరక బాధలను పోగొట్టే వారు. అమోఘమైన దివ్యదృష్టి కలిగి ఉండేవారు, అయినప్పటికీ తన స్వంత ప్రయోజనాలకు ఎప్పుడూ ఉపయోగించుకోలేదు. కాశ్మీర్‌లో వున్న సమయంలో కుల, మత, వయస్సు, లింగ భేదం లేకుండా అందరికీ దివ్య ఆనందం కలిగే మార్గాన్ని చూపించారు. అనేక వేలమంది భక్తులకు ఉత్తరాలు వ్రాసి కృష్ణనామం జపించే విధంగా ప్రేరేపించారు. భక్తులు కృష్ణప్రేమ వలయంలో చిక్కుకునేటట్లు చేశారు. హరనాథ్ కృష్ణుడి యందు ప్రేమతో వెర్రివాడిగా మారిపోయాడు. అందువలన అందరూ "పాగల్ హరనాథ్" అని పిలిచేవారు. కొంతమంది భక్తులకు హరనాథ్ కృష్ణుడిగా దర్శనం యిచ్చారు.

- సశేషం

# నారద భక్తి సూత్రములు

(గత సంచిక తరువాయి)

- వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

భక్తి సూత్రము 6

**యత్ జ్ఞాత్వామత్తో భవతి స్తబ్దో భవతి ఆత్మ రామో భవతి**



భావము: దేనిని (ఏ పరమ ప్రేమ స్వరూపమైన భక్తిని) తెలుసుకొన్న తరువాత మానవుడు ఉన్మత్తుడు, స్తబ్దుడు, ఆత్మారాముడు అవుతాడో...

ముందు వివరించిన రెండు భక్తి సూత్రాలలో **యత్ లబ్ధ్వా, యత్ ప్రాప్య** అని చెప్పిన విధంగా ఈ భక్తి సూత్రము **యత్ జ్ఞాత్వా** అని పరమప్రేమ రూపమైన భక్తిని గురించి తెలియజేస్తోంది. అయితే **జ్ఞాత్వా** అంటే తెలుసుకోవడమని కాక, అనుభవములోనికి తెచ్చుకోవడమని గ్రహించాలి. సాక్షాత్కారానుభవమైనదే జ్ఞానమని ఉపనిషత్తులు కూడా ఘోషిస్తున్నాయి కదా!

**మత్త** అన్నది మైమరపును సూచిస్తుంది. "**అంబుజోదర దివ్య పాదారవింద చింతనామృత పాన విశేష మత్త చిత్తమేరీతి నితరముల జేరనేర్చు**" అని ఆనాడు ప్రహ్లాదుడు కీర్తించినట్లు నిజమైన సాధకుడు తను నమ్మిన గురు పాద పద్మములయందు నిరంతరమూ మనసు నిలిపి మత్త చిత్తుడై వుంటాడు. ఆ మకరందమును గ్రోలిన భక్తుడు మత్త భృంగము రీతిలో భగవంతుడు తప్ప మరొక లక్ష్యము లేక పారవశ్యంలో మునిగి వుంటాడు.

**బాలోన్మత్త పిశాచవత్** అని చెప్పిన విధంగా జ్ఞాని కూడా ఉన్మత్త స్థితిలోనే వుంటాడు కదా! అదే ప్రకారం శ్రీ రామకృష్ణ పరమహంస జగన్మాత స్మరణలో అనేక గంటలు ఉండిపోయేవారట. అంతేకాక

**ఏవం వ్రతః స్వప్రియ నామ కీర్త్యా జాతానురాగో దృత చిత్త ఉచ్చైః**
**హసత్యథో రోదితి రౌతి గాయతి ఉన్మాదవ నృత్యతి లోక బాహ్యః**

అంటూ భగవద్భక్తులైన వారు తమ ప్రభువును నిరంతరము స్మరించుకుంటూ ఒక్కొక్కచో నవ్వుతూ పాడుతూ, ఏడుస్తూ నృత్యం

చేస్తూ తమను తాము మరచి ఉన్మత్తులై వుంటారని భాగవతంలో తెలియజేయబడింది. ఆ అంశమునే ఈ సూత్రము వివరిస్తోంది.

**స్తబ్ధో భవతి** అన్న ప్రస్తావనలో స్తబ్దుడు అన్న శబ్దానికి మందత్వమన్న అర్థము కాక నైష్కర్మ్యమనే భావనతో గ్రహించాలి.

**కర్మణ్యకర్మ యః పశ్యేత్ అకర్మణి చ కర్మ యః**

**స బుద్ధిమాన్ మనుష్యేషు స యుక్తః కృత్స్న కర్మకృత్**

అన్న భగవద్గీత శ్లోకము ద్వారా కర్మయందు అకర్మనూ అకర్మయందు కర్మనూ దర్శించగల బుద్ధి కుశలతనే ఆ స్తబ్దతగా గ్రహించాలి.

ఈ సూత్రములో చెప్పబడిన **ఆత్మారామ** శబ్దము భక్తుని తదేక పరాయణత్వమును సూచిస్తుంది. అది సర్వ వ్యాపార శూన్యత్వమును గాక, చేసే వ్యాపారములన్నిటినీ భగవత్స్మరణలోనే చేస్తారని తెలుసుకోవాలి.

భాగవతంలో కూడా **ఆత్మారామశ్చ మునయోః నిర్గ్రంథా కుర్వంతి అహైతుకీం భక్తిం...** అంటూ ఆత్మారాములైన మునులు బంధాల నుంచి విడివడి నిర్హేతుకంగా భక్తిని ప్రకటిస్తారని చెప్పబడింది. అదే ప్రతి సాధకుడి పరమావధి కావాలి.

పై విధంగా ఈ సూత్రము భక్తి తో భగవంతుడి స్మరణలో మమేకమైన సాధకుని యొక్క స్థితిని తెలియజేస్తోంది. - సశేషం

**వామ భాగమున సీతయు, ఎదుట హనుమంతుడును, వెనుక లక్ష్మణుడును, ఇరు ప్రక్కల భరత శత్రుఘ్నులును, వాయువ్యాది మూలలయందు సుగ్రీవ, విభీషణ, అంగద, జాంబవంతులును కలిగి మధ్యమందున్న నల్ల కలువవలె కోమల కాంతిగల నీలమేఘ శ్యాముడైన శ్రీరాముని నే సేవింతును.**

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**మే 2024**

3 శుక్ర: శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

6 సోమ: మాసశివరాత్రి

8 బుధ: అమావాస్య

10 శుక్ర: అక్షయ తృతీయ - శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

12 ఆది: శ్రీ శంకర జయంతి - శ్రీ బాబు బృందావన మూర్తి ప్రతిష్ట 29వ వార్షికోత్సవము. సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

23 గురు: వైశాఖ(గురు) పూర్ణిమ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

26 ఆది: వైశాఖ బహుళ తదియ - ఆశ్రమ స్థాపిత 52వ వార్షికోత్సవం, శ్రీ సద్గురు పాదపూజ.

27 సోమ: వైశాఖ బహుళ పంచమి - శ్రీ మహాకాళికా పరమేశ్వరీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి వారల ప్రతిష్టా వార్షికోత్సవము. రాత్రి 7.00 గం. లకు సామూహిక లీలా కళ్యాణ మహోత్సవము.

31 శుక్ర: 52వ ఆశ్రమ వ్యవస్థాపక దినోత్సవం (తేదీ) - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

**జూన్ 2024**

1 శని : శ్రీ గురుదశమి, హనుమజ్జయంతి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

5 బుధ: మాసశివరాత్రి

6 గురు: అమావాస్య

8 శని : జ్యేష్ఠ శుద్ధ విదియ - పావులూరు శాఖ వార్షిక సత్సంగ సమావేశములు. శ్రీ అవధూతేంద్ర సరస్వతీ స్వామివారి ఆరాధన, హారతి.

15 శని : జ్యేష్ట శుద్ధ నవమి - శ్రీ సుగుణ ప్రసాద మాతాజీవారి షోడశ వార్షికారాధన. సత్సంగం.

21 శుక్ర: జ్యేష్ట పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ.

# మనశ్శతకము

(గత సంచిక తరువాయి)

పరశురామపంతుల లింగమూర్తి కవి
(తాత్పర్యము: కుమారి సన్నిధానం కాళీమాత)

**53. తలపులు తలచెడి వానిం, దలపులలో నుండువాని దలపు దగులకం**
**దగిలిన వానిని నీలో, దలపోయుము రాముడని ముదంబున మనసా.**

తాత్పర్యము: చంచలమైన చిత్తమునందు కలిగెడు అనేకమైన తలపులు కాదని వాటికాధారమైన శ్రీరాముని నిశ్చలమున తలపోసి ముదము నొందు మనసా.

**54. శబ్దోత్పత్తిస్థానము, శబ్దలయస్థలము వెదకి సమరసముగ నా**
**శబ్దములో శబ్దము నిశ్శబ్దమనుచు దలపు రామచంద్రుని మనసా.**

తాత్పర్యము: శబ్దము జన్మించు స్థానము, శబ్దములు అణగిపోవు స్థానము వెదకి శబ్దములలోని శబ్దమునకు ఆధారమైన నిశ్శబ్దము శ్రీరామ చంద్రునిగా తెలియుము మనసా.

**55. శబ్దము నంటక తగు నిశ్శబ్దంబును గాక వానిసరస మరయుచున్**
**శబ్దాతీతుండై నిశ్శబ్దుండగు రాము దలపు సతతము మనసా.**

తాత్పర్యము: శబ్దము కాక, నిశ్శబ్దమును గాక వానితో కూడి యుండి కూడ నిశ్శబ్దాతీతుడై నిశ్శబ్దుండైన శ్రీరాముని నిత్యము తలపుము మనసా.

**56. బ్రహ్మాండములు మహేశ, బ్రహ్మాదులు జనిన వెనుక బరగెడు శబల**
**బ్రహ్మము నంటని రామ, బ్రహ్మము నెల్లపుడు దలపు భక్తిన్మనసా.**

తాత్పర్యము: బ్రహ్మలోకములు ఆదిగాగల త్రిలోకములు, ఇతర బ్రహ్మాండ లోకములన్నింటికి అందని, అంటని రామ బ్రహ్మమును నిత్యము భక్తి తలపు మనసా.

- సశేషం

(గత సంచిక తరువాయి)

# నిరీక్షణ

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్

తెలుగు అనువాదం - శశికళా దివాకర్

రాముడు ఏమాత్రమూ కలవరపడకుండ "తమ్ముడా! నీవు సీతను భద్రముగ చూసుకొనుము. నేను వీరందరినీ యముని వద్దకు పంపివేసి వచ్చెదను" అన్నాడు. సీత, లక్ష్మణులు వెళ్ళిన పిదప, రాముడు ఆ అసుర సైన్యమును సంహరించి తన వింటికి విందు చేశాడు. ఈ ఒక్క నరుడు తమపై సాధించిన విజయము ఖరునికి ఒక అతిశయముగ గోచరించింది. మరొక పెద్ద సైన్యముతో తాను వచ్చి రామునితో యుద్ధం చేశాడు. ఆ యుద్ధమున తాను, తన సైన్యము ఛిన్నాభిన్నమైపోయి కాలునియొద్దకు చేరుకున్నారు.

ఇట్టి కంటికినింపు కలిగించిన దృశ్యమును గాంచిన జనక పుత్రిక పరుగున వచ్చి రాముని ఆలింగనమొనర్చుకుంది. 'ఇప్పడైన నా పరాక్రమము నీకు తెలిసిందా!? అప్పడు అయోధ్యలో నిన్ను అడవికి రావలదని చెప్పినప్పడు నీవు నన్నుజూసి, 'పురుష వేషమందున్న స్త్రీ'వని పరిహాసము చేశావు కదా?' అని రాముడు ఆమెను ప్రేమతో దగ్గరకు చేర్చుకున్నాడు.

ఇదే దృశ్యమును ఆవలి వైపు నుండి గాంచిన శూర్పణఖ 'ఈతడే రావణుని సంహరించదగు పరాక్రమవంతుడు. ఈతని మూలంగానే వాని చరిత్ర ముగించవలయును' అని తలచి, లంకేశుని వద్దకు పరిగెత్తింది. "అన్నా! నాకు జరిగిన అవమానము పోగొట్ట నీవు వెళ్ళి రామ లక్ష్మణులను సంహరించి, ఆ సౌందర్యవతి సీతను నీవు పరిణయమాడ వలయును" అని పలికి రావణుని మనసులో 'సీతపై కామపూరితమైన కోరిక' అను ఒక విషబీజమును నాటింది.

సీతయొక్క సౌందర్యాతిశయము రావణుని మదిలో కామమును రేకెత్తించు విధమున జరిగిన దానిని ఇంకాస్త జోడించి రావణునికి పలు విధములుగ వివరించి, "అటువంటి గొప్పదనమును సంతరించుకున్న ఆమెను నీవద్దకు చేర్చవలయునని యత్నించు సమయమున రాముని సహోదరుడైన లక్ష్మణుడు, మా మధ్యకు వచ్చి

నన్ను ఈ విధంగా ఛిన్నాభిన్నము గావించాడు” అని రోదించి, మరల, “సీత అన్ని విధములుగ నీకు తగినది. ఆమెను నీవు పొంది, రాముని నాకు అప్పగించు. ఇదియే నీవు నాకు చేయదగిన పరిహారం” అని ముగించింది శూర్పణఖ.

శూర్పణఖ చేసిన వర్ణనను వినిన పిదప ఆ సౌందర్యరాశియైన సీతను తన వశపరచుకొనుటలో ఏమాత్రం ఆలస్యం చేయకూడదని దలచి రావణుడు ఒక నిర్ణయానికి వచ్చాడు.

‘సీతను ఎలాగైనా రామునినుండి విడదీయవలయును. తనకు ప్రియాతిప్రియమైన సీతను పోగొట్టుకొనినచో రాముడు ఆ ఎడబాటును సహించలేక ప్రాణములు విడచిననూ ఆశ్చర్యపోనవసరం లేదు. ఇలా చేసినట్లైతే సీతను పొందవచ్చును, మరియు అసుర కులమునకు ఏర్పడిన అవమానమునూ తొలగించుకొనవచ్చును’ అని భావించిన రావణుడు తన మేనమామగారైన మారీచుడు తపస్సు చేసుకొను ఆశ్రమమునకు చేరుకున్నాడు.

“మామగారూ! ఎవరో అయోధ్య యువరాజట, రాముడట, భార్య, తమ్మునితో కలసి రాజ్యమును వీడి, దండకారణ్యమందు ఒక నకిలీ సన్యాసివలె నివసిస్తున్నాడట. ఆతడు నా సహోదరి శూర్పణఖకు చేసిన అవమానమునకు ప్రతీకారము తీర్చుకొనుటకు బయలుదేరిన నా సహోదరులైన ఖరుడు, దూషణుడు, త్రిశిరులను ముగ్గురినీ, వారి సైన్యమంతటినీ నాశనమొనరించెను. దీనికంతటికీ నేను ఆతనికి గుణపాఠం చెప్పదలచుకున్నాను. అందులకు మొదట అతని పత్నియైన సీతను అపహరించదలచితిని. కావున, దానికి మీ యొక్క సహకారం కావలయును” అని మారీచుని రావణుడు కోరాడు.

“అల్లుడా! నిప్పుతో చెలగాటమాడవలదు. రాముడు ధర్మమునకు ప్రతిరూపమే కాదు, ఆతడు బహుపరాక్రమశాలి. నీ విరోధి ఎవరో ఒకరు మన రాక్షసకుల నాశనమునుగోరి నీ మనసులో ఒక విష బీజమును నాటి, ఇటువంటి ఆలోచనలను నీలో రేకెత్తించారు. రాముడు బాలునిగనుండు సమయమందే ఆతని వింటి బల తాకిడినుండి నేను తప్పించుకుని, ప్రాణాలు కాపాడబడి ఇలా బ్రతుకుచున్నాను. ఇట్టి

ఆత్మహత్యాయత్నమును విరమించుకొనుము” అని బదులిచ్చాడు మారీచుడు.

“మామగారూ! మీయొక్క తెలివితేటలను నమ్ముకుని నేను ఇచ్చటకు రాలేదు. నేను చెప్పినట్లు చేయకపోతే ఇప్పడే మిమ్ములను సంహరించెదను” “వలదు...వలదు...అట్లు చేయవలదు...నీ చేతులలో మరణించుట కంటే యోగ్యవంతుడైన ఒక శతృవు చేతిలో చావడం మేలు. చెప్పు... నేను చేయవలసిన కార్యమేమిటి?”

“అలా రమ్ము దారికి! నీవు ఒక బంగారు జింక రూపమును దాల్చి, పంచవటియందున్న రాముని ఆశ్రమం ముంగిట తిరుగుచుండ వలయును. స్వర్ణమయమైయున్న నిన్ను జూచి, సీత రామునితో నిన్ను పట్టుకుని రమ్మని కోరుతుంది. వెంటనే రాముడు నిన్ను పట్టుకొన యత్నించును. ఆతనికి దొరకకుండా నీవు పరుగెత్తుచుండవలయును. అలా కాస్త దూరం వరకు పరుగెత్తిన పిదప ఆతడు నిన్ను పట్టుకున్నా, లేక నీపై అంబును వేసినా నీవు ‘సీతా అపాయం! లక్ష్మణా అపాయం!’ అని రాముని గొంతులో ఎలుగెత్తి అరవవలయును. మిగిలినదంతా నేను చూసుకుంటాను” అన్నాడు రావణుడు.

రావణునికి కాలుని చేతిలో చిక్కవలసిన సమయం ఆసన్నమైనదని మనసులో తలచిన మారీచుడు తన పనిని ఆరంభించాడు.

- సశేషం

## వేసవిలో శిక్షణా తరగతులు

1-5-2024 నుండి 31-5-2024 వరకు శ్రీకాళీగార్డెన్స్, నంబూరులో చిన్నపిల్లలకు వేసవి శిక్షణా తరగతులు ప్రార్థన, భగవద్గీత, ఉపనిషత్తులు మొదలగు అంశాలలో నిర్వహింప బడుతున్నాయి. ఆసక్తి గల తల్లిదండ్రులు విషయాన్ని గమనించి సద్వినియోగ పరచుకోగలరు!

వివరములకు డా.అరుణ. సెల్ నెం. 9346382563

# తలరాత

సేకరణ - కె. రాఘవరాజు

మన లోపల ఒకడు ఉన్నాడు.... అసలైన వాడు. కానీ వాడిదగ్గరికి వెళ్ళాలి అంటే 6గురు  దొంగలు అడ్డుగా ఉన్నారు. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యం అనే 6గురు  దొంగలు! ఈ 6గురిలో 4గురు దొంగల నుండి సులభంగా తప్పించు కోవచ్చు, కానీ ఇద్దరు దొంగలనుండి తప్పించుకోవడం చాలా కష్టం. ఆ ఇద్దరూ పెద్ద రౌడీలు. వాళ్ళే కామం, క్రోధం. ఈ ఇద్దరు రౌడీలు ఎక్కడ దాక్కొని ఉంటారు అంటే రజో గుణం అనే ఇంట్లో. **కామ ఏష క్రోధ ఏష రజోగుణ సముద్భవః.**

ఈ కామం, క్రోధం అనేవి రజోగుణంనుండి వస్తున్నాయి అని గీతలో శ్రీకృష్ణుడు చెబుతాడు. కాబట్టి రజోగుణం అనే ఇంట్లో ఈ ఇద్దరు దొంగలు ఉంటారు. ఈ దొంగలను పట్టుకోవాలి అంటే రజోగుణం అనే ఇంటికి తాళం వేయాలి. అంతే, ఇంక వాళ్ళు బయటికి రాలేరు. అయితే ఈ రజోగుణం అనేది ఫస్ట్‌ఫ్లోర్. ఇంకా మనం ఫస్ట్‌ఫ్లోర్‌కు రాలేదు. మనం గ్రౌండ్‌ఫ్లోర్‌లోనే ఉన్నాం.

మనలో ఉండే తమోగుణమే ఆ గ్రౌండ్‌ఫ్లోర్. అంటే మనం తమోగుణంలో ఉన్నాం. బద్దకం, అతి నిద్ర, ఆలస్యం, నిర్లక్ష్యం ఇవే తమోగుణం. ఇలాంటి తమోగుణంలో మనం ఉన్నాం. ఇంకా గ్రౌండ్‌ఫ్లోర్‌లోనే ఉన్నాం. ఈ గ్రౌండ్‌ఫ్లోర్ నుండి పైకి రావాలంటే చాలా కష్టం. అలాటి ఈ గ్రౌండ్‌ఫ్లోర్ నుండి పైకి వచ్చి, ఆ ఫస్ట్‌ఫ్లోర్‌కు వెళ్ళి అక్కడుండే 6గురు దొంగలను తప్పించుకొని ఇంకా పైకి వెళ్తే అప్పుడు సెకెండ్‌ఫ్లోర్ వస్తుంది. దానిపేరే 'సత్వగుణం'. ఇది చాలా పెద్దగా వుంటుంది. హాయిగా వుంటుంది. ఎక్కడ చూసినా వెలుగే వుంటుంది. అయితే చిన్న సమస్య ఇక్కడ ఒకే ఒక దొంగుంటాడు. భయపడకండి. వాడు మంచిదొంగ. వాడు మీకు మంచిమాటలే చెబుతూ వుంటాడు. మీకు థర్డ్‌ఫ్లోర్‌కు దారి చూపిస్తాడు. దాని పేరు శుద్ధసాత్వికం. ఇదే చివరిది. ఇక్కడే మనం అఖండమైన వెలుగులో కలిసిపోయేది. ఆ అఖండమైన వెలుగే పరమాత్మ. అది వెలుగులకు వెలుగు, మహావెలుగు. చివరిగా ఒక శుభవార్త ఏమిటంటే మనం గ్రౌండ్‌ఫ్లోర్ నుండి థర్డ్‌ఫ్లోర్ వరకు వెళ్ళడానికి ఒక లిఫ్ట్ ఉంది. దాని పేరే "భగవద్గీత".

గీతను చదువుతూ ఉంటే తమోగుణం నుండి రజోగుణానికి, రజోగుణం నుండి సత్వగుణానికి, సత్వగుణం నుండి శుద్ధసత్వం వరకు మనం ప్రయాణం చేసి, చివరికి శాశ్వతమైన స్థానాన్ని చేరుకోవచ్చు. పునర్జన్మ లేకుండా చేసుకోవచ్చు.

# ప్రేమ వర్షిస్తే మ్రోడులు చిగురిస్తాయి

ఎమ్. సింహాచలం

ఓ పానశాలలో ముగ్గురు స్నేహితులు కూర్చొని మద్యం సేవిస్తున్నారు. మద్యం ఉదరంలోకి జారుతుంటే, మైకం తలకెక్కుతోంది. తూలుతూ, ప్రేలుతూ వున్నారు. సమయం అర్ధరాత్రి కావస్తుండగా పానశాల కుర్రవాడు పానశాల మూస్తున్నట్లుగా హెచ్చరించాడు. ముగ్గురూ బయటకు వచ్చారు.

చలిగాలి హోరుగా వీస్తోంది. మొదటివాడు ఇలా అన్నాడు 'ఇప్పుడు ఇంటికి వెడితే నా భార్య తలుపు కూడా తీయదు. ఎలా?' రెండవవాడు ఇలా అన్నాడు 'నా భార్య తలుపు తీస్తుంది కానీ, భోజనానికి బదులు సతాయింపు వడ్డిస్తుంది. నేను పట్టలేక చితకబాదుతాను. ఆవిడ ఏడుస్తుంటే, పిల్లలు లేచి వంతపాడతారు. అంతా గందరగోళం!' మూడవవాడు మాట్లాడుతూ 'ఒరేయ్! అబ్బాయిలూ నాకు ఆ బాధ లేదోయ్! నా భార్య ఉత్తమురాలు' అన్నాడు.

మొదటి ఇద్దరూ పగలబడి నవ్వుతూ 'వాహ్! త్రాగుబోతుకు, మంచి పెళ్ళాం!' అంటూ హేళన చేశారు. 'నా మాట నమ్మకపోతే నాతోపాటు మా ఇంటికి రండిరా. మీకే తెలుస్తుంది' అన్నాడు మూడవ వాడు. 'అయితే సరే' అంటూ ముగ్గురూ తూలుతూ నడక సాగించారు.

'సుగుణా!' అంటూ తలుపు తట్టాడు మూడవవాడు. వెంటనే తలుపు తెరువబడింది. ముగ్గురూ లోపలికి అడుగు పెట్టారు. 'ఒంటి గంట కావస్తోంది. నువ్వు ఇంకా నిద్రపోలేదా సుగుణా?' అని భార్యను అడిగాడు. 'నేను నిద్రపోతే, మీరు బయట చలిగాలిలో పడిగాపులు కాస్తారా ఏమిటీ?' అని నవ్వుతూ అడిగింది సుగుణ.

'సరే, సరే, వీళ్ళు నా స్నేహితులు. ముగ్గురుకీ భోజనాలు సిద్ధం చెయ్యి. ఆకలి మండిపోతోంది. త్వరగా కానివ్వు' అన్నాడు. 'అలాగే! మీరు కొంచెం సేపు విశ్రాంతి తీసుకోండి. ఈలోగా భోజనం సిద్ధపరుస్తాను' అంటూ వాళ్ళకి కుర్చీలు అమర్చి, లోనికి వెళ్ళిపోయింది సుగుణ.

కొంచెంసేపట్లో ఆమె తిరిగి వచ్చి, 'మీరు కాళ్ళు కడుక్కుని రండి. భోజనం వడ్డిస్తాను' అన్నది. ముగ్గురూ లేచి బావి వద్దకు వెళ్ళారు.

మొదటివాడు అన్నాడు 'ఒరేయ్! నీవు అదృష్టవంతుడవి. నేను మా ఇంటికి పోతున్నాను. నీ భార్యవంటి ఉత్తమురాలి ఆతిథ్యం స్వీకరించగల యోగ్యత నాకు లేదు. ఆ అర్హత కలిగిననాడు నేను ఆమెచేతి ఆతిథ్యాన్ని పొందుతాను'. రెండవవాడు కూడా 'నిజమే ఆమెకు మన ముఖం ఎలా చూపగలం! పద పోదాం' అని వంత పలికాడు. మూడవవాడు వారిస్తున్నా వినకుండా సాగిపోయారు.

భోజనానికి ఒంటరిగా వచ్చిన భర్తను చూసి సుగుణ 'మీ స్నేహితులు ఏరి?' అని అడిగింది. పానశాల వద్ద తమ భార్యల గురించి స్నేహితులు చెప్పిన విషయాలు, వాళ్లను తాను ఎలా చెప్పి వెంటబెట్టుకు వచ్చినదీ, వాళ్ళు సిగ్గుపడి ఎలా వెళ్లిపోయిందీ అతడు వివరించాడు. 'అయ్యో!' అంటూ సుగుణ నిట్టూర్చింది.

అతడు భోజనం ముందు కూర్చునాడు. మద్యం మత్తు వీడిపోతోంది. అతని మనస్సు శరత్కాలపు కాసారం వలె నిర్మలంగా వుంది. స్నేహితుల భార్యల ప్రవర్తన అతని మనోదర్పణంపై పొడగడుతోంది. ఎదురుగా వున్న భార్య ముఖంలోకి చూశాడు. ఆ ముఖంలో సంతోష తరంగాలు తేలియాడుతున్నాయి. కళ్ళు నక్షత్రాలవలె మిలమిలా ఆడుతున్నాయి.

అతనిలో వేదనాగ్ని జ్వలించింది. భోజనం రుచించడం లేదు. గొణుగుతున్నట్లుగా అంటున్నాడు. 'నేను నికృష్టుణ్ణి. నా సంపాదన నా వ్యసనాలకు సరిపోతోంది. నీ జీతంతో నేను పోషింపబడుతున్నాను. ఏ విధంగానూ నిన్ను సుఖపెట్టడం లేదు. అయినా నా పట్ల నీకెందుకు ఇంత ఆప్యాయత?'

'అయ్యో! అవేం మాటలండీ! నేను మీ భార్యను. నాకు మిమ్మల్ని భగవంతుడు భర్తగా సమకూర్చాడు. మీరు మద్యం వల్ల సంతోష పడుతుంటే, డబ్బు ఖర్చు అవుతుందని నేనెందుకు బాధపడతాను. మీ సంతోషం నా సంతోషం కాదా? అంతకంటే ఏం కావాలండీ!'

వేదన అతణ్ణి దహించసాగింది. 'పశ్చాత్తాపం నన్ను మండిస్తోంది. నీ దగ్గరనుండి దూరంగా పోతే తప్ప నాకు శాంతి లభించేట్టు లేదు. కొంతకాలం నన్ను ఎక్కడికైనా పోనివ్వు' అన్నాడు.

'మీరు అలా మాట్లాడకండి. మీరు నాకు దూరమైతే నేను ఎంత ఆవేదన పడతానో మీకు తెలియదా? మీ అశాంతి పోవడానికి నేను ఏం చేయాలో చెప్పండి. అలాగే చేస్తాను' అన్నది.

'చేయవలసినది నీవు కాదు సుగుణా, నేను. నీకు తగిన భర్తగా మారేందుకు ప్రయత్నం చేయవలసింది నేను!' అన్నాడు. 'ఈనాటి నుండి ఈ మద్యపానాన్ని విసర్జిస్తాను. నీకు తగిన భర్తగా వ్యవహరిస్తాను' అన్నాడు.

ఆమె కనుకొనల నుండి ఆనంద బాష్పాలు జాలువారుతున్నాయి. అతడు ఆమెను దగ్గరకు తీసుకుని, కొనవ్రేళ్ళతో కన్నీళ్ళు తుడిచాడు. 'నిజం సుగుణా! నేను ఈ క్షణం నుండే మారుతున్నాను' అంటూ కౌగిలి లోకి తీసుకున్నాడు. భగవంతునికి కృతజ్ఞతలు అర్పిస్తూ అతని ఒడిలో ఒదిగిపోయింది.

**క్రోధ మూర్ఛితుడైనవాడు స్వంత తల్లిని, తండ్రిని, సోదరుని, పుత్రులను, బంధువులను కూడా చంపివేస్తాడు. క్రోధావేశమున చేసిన పనులకు ఆ తరువాత తరచుగా పశ్చాత్తాప పడవలసి వుంటుంది. క్రోధమే అతనిని సంసారంలో బంధిస్తుంది. సకల సద్గుణములను హరిస్తుంది. కనుక క్రోధమును విడిచిపెట్టాలి. క్రోధమే మహా శత్రువగు యముడు. లోభమే దుస్తరమైన వైతరణీ నది.**

**తృప్తియే నందనవనము. శాంతియే కామధేనువు. దీనిని గురించి మననం చేయాలి. శాంతిని కాంక్షించాలి.**

- శ్రీ రమణులు

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీబుల్లిమామయ్య తెలిపిన శ్రీబాబు లీలలు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

భగవానుడు మానవోద్ధరణ కోసమే సద్గురుమూర్తిగా అవతారం ధరించి వచ్చి మానవుల మధ్య సంచరిస్తున్నా, గుర్తించగలవారు లక్షకొక్కరున్నా గొప్ప విషయమే. మానవమాత్రునిగానే భావించేవారు అనేకులు; మంత్రతంత్రాలు నేర్చినవారని అపోహపడేవారు కొందరు; అసూయపడేవారు కొందరు; అవమానించేవారు కొందరు; అభిమానించేవారు కొందరు; అకాశానికెత్తేసేవారు కొందరు; అపార్థం చేసుకొనేవారు కొందరు; యిలా ఎందరెందరో? కాని వారు మానవునికి తానెవరో తెలుసుకోగల ఆత్మ జ్ఞానాన్ని ప్రసాదించ వచ్చిన అవతారమూర్తులని అర్థం చేసుకోగలవారెందరు?



ఇక మహాత్ములు మాత్రం సామాన్యులా? కొంచెంగానో గొప్పగానో అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తున్న వాళ్లకు ఎన్నో పరీక్షల రూపంలో రాపిడి పెడతారు. ఆ రాపిడి పెట్టటం వాళ్ల మంచి కోసమే. ఆ రాపిడి వలన ఆ సాధకునిలో మిగిలి ఉన్న కల్తీ పదార్థమంతా పోయి, పుటంపెట్టినకొలది బంగారం ప్రకాశించినట్లు, సానబెట్టినకొలది వజ్రం ప్రకాశించినట్లు ప్రకాశిస్తాడు.

శ్రీ పరశురామయ్యగారి ధర్మపత్ని చుక్కమ్మగారి పుట్టిల్లు వడాలి గ్రామం. ఆమె సోదరులు ముగ్గురు. సర్వశ్రీ వారణాసి సుందర రామయ్యగారు, లక్ష్మీ నరసింహంగారు, సీతారామయ్యగారు. ముగ్గురిని శ్రీబాబు 'మా మేనమామలు' అని పిలిచేవారు. శ్రీబాబు పరశురామయ్య గారింటికి వచ్చినప్పటినుంచి, మేనమామలతో కూడా పరిచయం ఏర్పడింది. ఆ మేనమామలు, వారి కుటుంబసభ్యులు అందరూ శ్రీబాబు యెడల గురుభావంతో ఉండేవారు. వారిలో మూడవవారైన సీతా రామయ్యగారు శ్రీబాబుతో చాలా సన్నిహితంగా ఉండేవారు. ముగ్గురన్నదమ్ములలోనూ వారొక్కరే సతీసమేతులై కొంతకాలం ఆశ్రమంలో నివసించారు. శ్రీబాబు వారిని "బుల్లి మామయ్య" అని పిలిచేవారు. శ్రీబాబుతో తమ స్వానుభవములను యితర

సన్నివేశములను పురస్కరించుకొని బుల్లిమామయ్యగారు వారి మేనల్లుడైన వారణాసి శ్రీరామశర్మతో వివరించిన కొన్ని సంఘటనలు అత్యంత ఆసక్తికరంగా ఉన్నాయి.

1. అవి శ్రీ పరశురామయ్యగారు యనమదుర్రులో ఉంటూ తమ స్వంత పొలంలో వ్యవసాయం చేయిస్తున్న రోజులు. సీతారామయ్యగారు స్వయంగా ఆ వ్యవసాయపు పనులను పర్యవేక్షించేవారు. దాళవా పంట కుప్ప వేశారు. నూర్పిళ్ళు అవుతున్నాయి. అప్పడు శ్రీ బాబు యనమదుర్రు వచ్చారు. ఒకరోజు శ్రీ బాబుకు సీతారామయ్యగారికి యిలా సంభాషణ జరిగింది.

శ్రీబాబు: బుల్లి మామయ్యా! నా దగ్గరకు వచ్చిన ప్రతి వాళ్ళూ ఎన్నెన్నో కోరికలతో వస్తారు. ఏమేమో అడుగుతారు. కాని నువ్వు యిన్నాళ్ళ నుంచి నా దగ్గరకు వస్తూ ఎప్పుడూ ఏమీ అడగవేమిటి?

సీతారామయ్యగారు: బాబూ! తమ దయవల్ల నా జీవితం ఏ లోటూ లేకుండా గడిచిపోతోంది. అడగవలసినదేమీ కనిపించలేదు.

శ్రీబాబు: కోరికలు లేని జీవితం ధన్యం మామయ్యా! పోనీలే; సరదాగా ఏదో ఒకటి అడుగు. (అది ఎండా కాలం. బాగా ఎండలు కాసే రోజులు. ఆ రోజున ఎండ మరీ తీవ్రంగా ఉంది. సాళవా పంటకు ఆకుమడి పోయాలి. వాన వస్తే అది బతుకుతుంది. కాని ఎక్కడా ఆ సూచనలు లేవు.)

సీతా: బాబూ! ఈ ఎండలు చూస్తే మండిపోతున్నాయి. వాన ఏమైనా వస్తుందంటారా? ఎప్పడు వస్తుందో చెప్పండి?

శ్రీబాబు: అడగక, అడగక మంచి ప్రశ్నే అడిగావే. వాన రాకడ, ప్రాణం పోకడ ఎప్పడో ఎవరు చెప్పగలరయ్యా? అయినా నువ్వు అడిగావు గనుక చెప్పవలసిందే. ప్రస్తుతం పొలంలో ఏం పని జరుగుతున్నది?

సీతా : దాళవా పంట కుప్ప వేశాము. నూర్పిళ్ళు జరుగుతున్నాయి.

శ్రీబాబు: అలాగా! (అని ఆకాశంవైపు ఒకసారి చూసి) నీకు యీ ఒక్క రోజు అవకాశం యిస్తాను. రేపు సాయంత్రం 5 గంటల లోపల నీ ధాన్యం ఎక్కడ వరకు చేర్చగలవో, అక్కడ నుండి వారం రోజుల వరకు ఒక్క అంగుళం కదపలేవు. అంత వాన కురుస్తుంది. రేపు చేతికి వాచి పెట్టుకుని టైము చూసుకో.

- సశేషం

విష్ణు  కథలు

(గత సంచిక తరువాయి) -రమణ ప్రసాద్

# సమర్థ రామదాసు

శివాజీకి పుట్టిన ఈ శంభాజీ చూడు ఎలా మగువ, మధువులకు దాసుడైపోయాడో! అతనికి దేశం గురించి ఏమైనా పట్టిందా? సమర్థులు శంభాజీకి ఉత్తరం వ్రాశారు. ఆ ఉత్తరం చదివి నిషా దిగినవాడిలా శంభాజీ సమర్థుల వద్దకు వచ్చి "మహాత్మా! మీ ఆజ్ఞ ప్రకారం నడుచుకుంటాను" అన్నాడు.

మాఘశుద్ధ పంచమినాడు తంజావూరు నుండి పంచలోహాలతో చేసిన రాముడి విగ్రహం ఒకతను పట్టుకొచ్చాడు. అతను మంచి శిల్పకారుడు. అతనికి చూపు పోయింది. సమర్థులు తంజావూరులో పర్యటిస్తుండగా సమర్థుల దృష్టి ఇతనిపై పడింది. సమర్థులు "నీకు చూపు వస్తే నాకు ఏం ఇస్తావు?" అని అడిగారు. శ్రీరాముడి పంచలోహాలతో చేసిన నాలుగడుగుల విగ్రహాన్ని మీకు సమర్పించు కొంటాను" అన్నాడు. అతనికి చూపు ప్రసాదించారు సమర్థులు. అన్న మాట ప్రకారం ఇప్పుడు ఆ విగ్రహం చేసి తెచ్చాడు. సమర్థులు ఆ విగ్రహాన్ని ఆ గదిలోనే ప్రతిష్ఠించి ప్రాణ ప్రతిష్ఠ చేశారు. "రామా! నీ ఆజ్ఞను అనుసరించి కృష్ణా తీరాన నివసిస్తూ ధర్మ ప్రచారం, జగదోద్ధరణ చేశాను. భక్తి సాంప్రదాయాన్ని పెంచాను. కాని నాకు ఒక కోరిక మిగిలింది. నా తర్వాత కూడా జనులకు నీ దర్శనం కలిగి వాళ్ళు తరించాలి" అన్నారు. అప్పుడు రాముడు "నా దర్శనం కలుగుతుంది. కాని నీలా సాధన చేయాలి" అన్నారు. సమర్థులు నవ్వి, "ఏదైనా సులభమైన మార్గం సెలవియ్యండి ప్రభూ" అన్నారు. శ్రీరాముడు మందహాసంతో "త్రయోదశాక్షరి మంత్రాన్ని మనసారా ఎవరు జపిస్తారో వారికి నా అనుగ్రహం కలుగుతుంది" అని సెలవిచ్చారు.

మాఘ శుద్ధ నవమి వచ్చింది. సమర్థులు శ్రీరామునికి సాష్టాంగ నమస్కారం చేశారు. తనను దర్శింపదలచిన వారందరికీ దర్శనం ఇచ్చారు (కళ్యాణ్‌కు తప్ప). ఆయన అక్కాకు ప్రత్యేకించి తను దేహం చాలించేదాకా కళ్యాణ్‌కు కబురు చేయవద్దు అని చెప్పారు. అక్కా

బ్రతిమాలగా చక్కెరనీరు, పానకం త్రాగారు. దిగంబరావస్థలో శ్రీరాముని ముందు కూర్చున్నారు. రాముడి దృష్టిలో తమ దృష్టి నిలిపారు. అక్కా, ఉ ద్ధవుల ఎక్కిళ్ళు వినిపించాయి. "నా సహచర్యంలో మీరు నేర్చుకున్నది ఇదేనా? అన్నారు. "కాదు! కాదు! మీ సగుణరూపం ఇక మాకు లేదని" అక్కా, ఉద్ధవ్ భోరుమన్నారు.

"అక్కా! ఈ దేహం ఎప్పటికైనా రాలిపోవల్సినదే కదా? నన్ను ప్రత్యక్షంగా చూడాలనుకొన్నప్పుడు ఇలా చేయండి" అని, "మీరు కంగారు పడకండి. మీకు కావలసినదంతా దాస్‌బోధలో వివరంగా తెలుపబడింది" అంటూ దృష్టి రామపాదాలపై నిలిపి "ఓంశ్రీరాం" అంటూ మూడు మార్లు ఆ కోట కొండలు దద్దరిల్లేటట్లు గర్జించారు. సమర్థుల శరీరంనుండి ఒక దివ్య తేజస్సు శ్రీరాముడిలో కలిసిపోయింది. ఆయన అవతార సమాప్తి అయింది. మఠానికి ఉత్తరాన ఉన్న స్థలంలో తులసి, బిల్వ, చందనకట్టెలతో చితి సిద్ధపరచి అగ్నిసంస్కారం చేశారు. రెండు రోజుల్లో అక్కడ స్వయంభూ లాంటి సమాధి ఏర్పాటైంది. ఆ సమాధివద్ద శంభాజీ రాముడి గుడి కట్టించి ప్రాణ ప్రతిష్ఠ చేశాడు.

సమర్థులు దేహం చాలించారని కళ్యాణ్‌కు అంతరంగ జ్ఞానం కలిగింది. అతడు క్షవరం చేయించుకొని ప్రాయశ్చిత్తం చేసుకున్నాడు.

తర్వాత గఢ్ పైకి వెళ్ళి చూశాడు. ఎక్కడ చూసినా సమర్థుల జ్ఞాపకాలే. కాని సమర్థులు కానరాలేదు. సమాధి వద్దకు వచ్చి అమ్మా! గురుమాతే! అంటూ సమాధికి తల ఆనించి పిల్లవాడిలా విలపించాడు. సమాధి చీల్చుకుని సమర్థులు బయటకు వచ్చి "నా పుత్రా! కళ్యాణ్! వచ్చావా నా తండ్రీ!" అని "నా ఆజ్ఞ అయ్యేదాక గఢ్ మీదకు రావద్దని ఇందుకే ఆజ్ఞాపించాను. ఈ మోహంలో నిన్ను ఇరికించకుండా ఉండాలని ఇలా చేశాను. వచ్చావా నా తండ్రీ!" అన్నారు. "నువ్వు నన్ను మానసికంగా పూజించినప్పుడల్లా నీకు ప్రత్యక్షదర్శనం ఇస్తాను" అని మాట ఇచ్చారు. అక్కా, ఉద్ధవులకు కూడా అదే వరం ఇచ్చారు. ముగ్గురి చేతులు కలిపి "మీ మైత్రి, మీ ఆరాధన చిరస్థాయిగా నిల్చుగాక" అని దీవించారు.

సమర్థులు సమాధిని చీల్చుకు వచ్చిన చీలికను ఇప్పటికీ మనం చూడవచ్చు. అదే కళ్యాణ్‌పై ఆయనకు గల ప్రేమకు సాక్ష్యం. ఇది సమర్థుల చరితామృతం.

# శ్రీ కాళీ వనాశ్రమ శాఖ, భీమవరము,
# పశ్చిమ గోదావరి జిల్లా (ఆం.ప్ర)

**భవన నిర్మాణము**

సమర్థ సద్గురుదేవులు శ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారు లోక కళ్యాణం కొరకై ఎన్నో చోట్లకు వెళ్ళి ఎందరో భక్తుల ఆర్తిని బాపిన అవతార పురుషులు. వారు నడయాడిన ఊరు భీమవరము మరియు ఆ చుట్టు ప్రక్కలనున్న యనమదుర్రు, దిరుసుమర్రు మొదలగు గ్రామములు. శ్రీ స్వామివారు మహా ప్రస్థానం పొంది 35 సంవత్సరములు అయినవి. ఇచ్చటి భక్తులందరూ చేరి భీమవరం-ఉండి రోడ్డున దాతలు ఇచ్చిన స్థలములో బృందావనము, దాని ప్రక్కన అన్నదాన శాల, వసతి గృహము నిర్మింప సంకల్పించినారు. ఈ భవన శంకుస్థాపన శ్రీ కాళీవనాశ్రమ పీఠాధిపతి యోగిని శ్రీచంద్ర కాళీ ప్రసాద మాతాజీవారు, ది.10-05-2023 తెల్లవారు జామున 3.24 గం.లకు చేశారు.

ఈ సందర్భమున భక్తులకు చేయు విన్నపమేమనగా, మీరెల్లరూ ఉదార స్వభావముతో ముందుకు వచ్చి త్వరలో ఈ భవన నిర్మాణము పూర్తియగునట్లు తమ సహాయ సహకారములను ధన రూపేణ, వస్తు రూపేణ అందించమని ప్రార్థించుచున్నాము.

విరాళములు ఈ క్రింది బ్యాంక్‌కు పంపవలెను.

Sri Sri Sri Hanumat Kali Vara Prasad Babu Trust
Bank of Baroda, Nambur Branch
S/B Account No : 69900 1000 00 172
IFSC : BARB0DBUNAM (5th character is 'zero')
Contact Numbers
Murali : 93983 34345
Tummalapalli Siva : 96181 99556

**భక్తులు ఒసగు విరాళములకు ఐ.టి యాక్ట్ 80జి క్రింద పన్ను రాయితీ లభించును.**

---

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

## మార్చి 8 న శ్రీ కాళీవనాశ్రమమునందు జరిగిన శివరాత్రి పండుగ దృశ్యములు



బృందావనంలో
శ్రీ గురుదేవులకు అభిషేకము



శివాలయంలో
సహస్రఘటాభిషేక
అనంతర పూజా దృశ్యము



శ్రీ శివపార్వతుల
లీలా కళ్యాణోత్సవము



శ్రీ శివపార్వతుల
నగరోత్సవము

**REGD. NEWS MAGAZINE PERIODICAL**
**Posted on Fifth and Sixth of every month**

**RNI No. 37804/81**
**POSTAL REGD. No. : GTR/27/2024-26**

# మార్చి 15 నుండి 17 వరకు యాదగిరిగుట్టలో శ్రీ సద్గురు బుచ్చిదాసు బ్రహ్మవిద్యాగీతాశ్రమ 56వ వార్షికోత్సవములలో పాల్గొన్న శ్రీ మాతాజీ








If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.